జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## నల్లగొండ
సూర్యాపేట - యాదాద్రి భువనగిరి
శనివారం 14 మార్చి 2026 పేజీలు : 14

2 లో..



పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

# ప్రజా ప్రతినిధులు, అధికారులందరు
# కలిసికట్టుగా పనిచేస్తే అభివృద్ధి




- నూతన ప్రజాప్రతినిధులు గ్రామాలలో పర్యటించి, సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలి
- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్
- మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి
- ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్సీ శంకర్ నాయక్

నల్లగొండ మార్చి 13 (ప్రజా జ్యోతి ప్రతినిధి )

నూతన ప్రజాప్రతినిధులు గ్రామాలలో పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.

7 లో..

## శ్రీ చైతన్య విద్యార్థినీలను అభినందించిన మేయర్


నల్లగొండ మార్చి 13 (ప్రజా జ్యోతి)

ఇటీవల నిర్వహించిన నేషనల్ ఒలంపియా టెస్ట్ లో జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు పండు ఋగ్వేదిత గ్రాండ్ ప్రైజ్ ను గెలుచుకోగా, అంతటి సహస్ర మొదటి ప్రైజ్ ను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం నగర మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. విద్యార్థిని విద్యార్థులు మంచి చదువుతో బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, అందుకు కృషి చేస్తున్న, చైతన్య విద్యాసంస్థల అధ్యాపకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మల్లెపాటి శ్రీధర్, శ్రీవిద్య, ఏజీఎం సుజాత, నాగేశ్వరరావు ప్రిన్సిపాల్ నాగరాజు, రాజేందర్ సాయి రెడ్డి , వాసవి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




## వేసవిలో తాగు, సాగునీటి
# కొరత లేకుండా చూడాలి

- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



వార్త 2లో



## గ్యాస్ బ్లాక్ చేస్తే ఖబర్దార్..!

వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రులు ఉత్తమ్, తుమ్మల ఆదేశాలు



వార్త 2లో

# పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

**మునగాల మార్చి 13 ప్రజా జ్యోతి**

మునగాల మండలం కొక్కిరేణి గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు పరీక్షల సందర్భంగా అవసరమైన పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. సూర్యాపేట మెడికల్ కాలేజ్ ఫోర్ అండ్ సి డిపార్ట్మెంట్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్న గ్రామనివాసి నందిగామ పెద్ద రాములు మరియు వారి కుటుంబ సభ్యులు విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు మరియు ఇతర పరీక్షా మెటీరియల్స్‌ను అందజేశారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువులో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ఈ సహాయం అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు కూడా ఈ సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ సైదులు, నందిగామ సుశీల, నందిగామ పూజ, చినరాములు పాల్గొన్నారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులు కూడా హాజరై విద్యార్థులకు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. గ్రామస్తులు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు.

# మోత్కూర్ 11వ వార్డులో ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

**మోత్కూర్, మార్చి 13: (ప్రజాజ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మోత్కూర్ మున్సిపాలిటీ 11వ వార్డులో కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, 9వ వార్డు కౌన్సిలర్ బీసు శ్రీకాంత్ గౌడ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న గౌడ్ మాట్లాడుతూ 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా వార్డులో ఉన్న పలు సమస్యలపై ప్రజలతో చర్చించారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, తాగునీటి సమస్య, దోమల నివారణ, కొత్త మోరీల ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, కోతుల బెడద నివారణ వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. అలాగే పెండింగ్ ఫైళ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రోడ్డు భద్రత కార్యక్రమాలపై కూడా అవగాహన కల్పించారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చేపట్టిన 99 రోజుల ప్రగతి ప్రణాళికను గౌరవ శాసనసభ్యులు మందుల సామేల్ సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన మున్సిపల్ కమిషనర్ సతీష్, మేనేజర్ ప్రభాకర్, వార్డు



ఆఫీసర్ సంధ్య, జూనియర్ అసిస్టెంట్ యాదయ్య, నరేందర్, ఆర్పీ ధనలక్ష్మి, వాటర్ లైన్‌మెన్ నాగరాజు, సంఘ బంధం, ఆశా వర్కర్లు మరియు ఇతర అనుబంధ సంఘాల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చైర్‌పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య వార్డు ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. తరువాత 11వ వార్డు కార్యాలయాన్ని ప్రారంభించి వార్డు ఆఫీసర్ సంధ్యకు బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమం అనంతరం ర్యాలీ నిర్వహించి పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

# వేసవిలో తాగు, సాగునీటి కొరత లేకుండా చూడాలి

## - అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**మిర్యాలగూడ, మార్చి 13,( ప్రజాజ్యోతి ):**

వేసవికాలంలో తాగునీటి కొరత లేకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం మిర్యాలగూడలో నిర్వహించిన ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్ మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారు లతో ఇదే విషయమై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నల్గొండ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి రిజర్వాయర్లు, తదితర వివరాలన్నింటిని ఇంజనీరింగ్ అధికారుల ద్వారా అడిగి తెలుసు కున్నారు. అనంతరం మాట్లాడుతూ వేసవిలో తాగునీటికీ అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ముఖ్యంగా గత సంవత్సరంఅనుభవాలను దృష్టిలో ఉంచుకొని జూన్ చివరి వరకు ప్రజలకు ఆయా రిజర్వాయర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకుఅవసరమైనంత నీటిని సిద్ధంగా ఉంచా లని ఆదేశించారు. ముఖ్యంగా ఉదయ సముద్రం ద్వారా నల్గొండ పట్టణానికి, చుట్టుపక్కల గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసేందుకు అవసరమయ్యే నీటిని నిలువ ఉంచాలన్నారు. ఇదే సమయంలో ఉదయ సముద్రం కింద సాగవుతున్న పంటల పరిస్థితిలను ఎప్పటి వరకు సాగునీరు అవసరం ఉందో క్షేత్రస్థాయిలో ఇరిగేషన్, రెవెన్యూ ,వ్యవసాయ అధికారులుసంయుక్తంగా తనిఖీ చేసి నివేదిక సమర్పించాలన్నారు. సాధ్యమైనంత త్వరగా రైతులు ప్రస్తుత పంటల ను కోసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.ఎట్టి పరిస్థితులలో తాగునీటికి సమస్య ఏర్పడకుండా చూడాలని, ఆ విధంగా ప్రణాళికరూపొందించాలని కోరారు., సాగర్, ఇతర ప్రాజెక్టుల ద్వారా వచ్చే సాగునీరు, తాగునీటి రిజర్వాయర్లను ఎప్పటికప్పుడు సమీక్షించి తనకు నివేదిక సమర్పించాలనిఆదేశించారు.అలాగే మిర్యాలగూడ పట్టణానికి తాగునీరిచ్చేనాగార్జునసాగర్ ప్రాజెక్టు టెల్పాండ్ ను ఇరిగేషన్ ,తాగునీటి అధికారులతో సందర్శించి నివేదిక ఇవ్వాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ను కోరారు. ఆయా ప్రాజెక్టుల కింద ఎక్కడైనా భూ సేకరణకు సంబంధించి సమస్య ఉంటేపరిష్కరించాలని ,అలాగే పేమెంట్ లకు సంబంధించిన వివరాలను సైతం సమర్పించాలని ఆదేశించారు.ఆయా ప్రాజెక్టుల కింద భూసేకరణకు గుర్తించిన భూములకు సంబంధించి వెంటనే సరిహద్దులను ఏర్పాటు చేయాలని,పెగ్ మార్కింగ్ లేదా కందకాలు తవ్వడం వంటివి చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# గ్యాస్ బ్లాక్ చేస్తే ఖబర్దార్..!

## - మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

### తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు..

### సరిపడా గ్యాస్ సరఫరా

### పంటలు ఎండిపోయాయి అన్న అపవాదు రాకుండా అధికారులుఅప్రమత్తంగా పనిచేయాలి

### ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యాలు సాధించాలి

### వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రులు ఉత్తమ్, తుమ్మల ఆదేశాలు

**మిర్యాలగూడ, మార్చి 13,( ప్రజాజ్యోతి ):**

సోషల్ మీడియా వేదికగా గ్యాస్ నిల్వలపై వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, ప్రజల గృహ అవసరాలకు సరిపడా గ్యాస్ సరఫరా జరుగుతుందని, గ్యాస్ బ్లాక్ చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరించారు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి.శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిరామకృష్ణారావుతో కలిసి హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు,ఇరిగేషన్, వ్యవసాయ,పౌరసరఫరాల అధికారులతో సాగు, తాగునీరు, ఎల్పిజి గ్యాస్ సరఫరా తదితర విషయాల పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.మిర్యాలగూడలో నిర్వహించిన ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్ మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎల్పీజీ గ్యాస్ సరఫరా ప్రస్తుత పంటపొలాలకు సాగు నీరు, రబీ సీజన్లో చేపట్టే ధాన్యం సేకరణ పై అధికారులకు దిశానిర్దేశం చేశారు.జిల్లా కలెక్టర్లు అధికారులు ఎక్కడ సాగునీరు, విద్యుత్ కొరత కారణంగా పంటలు ఎండిపోకుండా చూడాలని, ఈనెలాఖరు వరకుఅత్యంత అప్రమత్తంగా ఉండి పంటలను కాపాడాలన్నారు.ప్రతి రెండు,మూడు రోజులకు ఒకసారి ఆయా ప్రాజెక్టుల కింద ఇంజనీర్లు, వ్యవసాయ అధికారులు, విద్యుత్ శాఖ అధికారుల తో సమన్వయంచేసుకొని పరిస్థితులనుసమీక్షించాలని చెప్పారు.ఇరిగేషన్ అధికారులు,లస్కర్ల తో మొదలుకొని అందరు అందుబాటులోఉండాలని, విషయాన్ని సీరియస్ గా తీసుకోవాలన్నారు. వ్యవసాయం,నీటిపారుదల,విద్యుత్ పై ప్రత్యేక దృష్టికేంద్రీకరించాలన్నారు. సాగునీరు లేని కారణంగా ఎక్కడ పంటలుఎండిపోయాయన్న అపవాదు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన తేల్చి చెప్పారు. ఎల్.పి.జి గ్యాస్ సరఫరా విషయంలో ఎటువంటి గందరగోళానికి గురి కావొద్దని,గృహ వినియోగదారులకు సరిపడా సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు.సోషల్ మీడియా వేదిక ద్వారా జరుగుతున్న తప్పుడు ప్రచారంతో కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించేందుకు జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రస్థాయిలో తిప్పి కొట్టారు.ఇటువంటి గందరగోళంఏర్పడినందునే రోజు వారిగా 72 శాతం బుకింగ్స్ జరుగుతున్నాయని, అయితే గృహ వినియో గదారులతోపాటు, ఆసుపత్రులకు,విద్యాసంస్థలకు,వృద్ధాశ్రమలకు,ప్రభుత్వ సంస్థలకు ప్రాధన్యత క్రమంలో సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని ఆయన తెలిపారు.రాష్ట్రంలో 810 ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందన్నారు. అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ చేయాలని చూస్తే ప్రభుత్వం ఎంత మాత్రం ఉపేక్షించదని, కఠినమైన చర్యలకుఉపక్రమిస్తుందని ఆయనహెచ్చరించారు.

# ప్రజానాట్య మండలి జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయండి



**మునగాల మార్చి 13 (ప్రజా జ్యోతి ) :-**

కళకళకోసం కాదు! కళప్రజల కోసం!!కళప్రగతికోసం అనే నీ నాదశీ తో ముందుకు సాగుతున్న ప్రజానాట్య మండలి సూర్యాపేట జిల్లా 3వ మహా సభలను జయప్రదం చేయాలనిప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు బచ్చలకూర రాంబాబు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూర స్వరాజ్యం,అన్నారు.శుక్రవారం నేలమర్రి లో ప్రజానాట్య మండలి సూర్యాపేట జిల్లా 3వ మహా సభల ను జయప్రదం చేయాలనీ కరపత్రం విడుదల చేయటం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజానాట్యమండలి ఏర్పడి నేటికి 82సం,, రాలు అయింది.ప్రజానాట్య మండలి వేలాది మంది కళాకారులను కదిలించి అక్షర సాంస్కృతిక ఉద్యమం నడిపింది.సారా వ్యతిరేక ఉద్యమం లో ఆట పాట వీదినాటకాల ద్వారా ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్యశీ చేసింది. మూఢనమ్మకాలు, సామాజిక అంశాలపైన, కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వలు అవాలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపైన ప్రజలను చైతన్య పరుస్తూ ప్రజా ఉద్యమం లో మమేకమైయి ఆట,పాటల, పల్లె సుద్దులు, వీది నాటకాల తో ప్రజానాట్య మండలి కార్యక్రమలు నిర్వహిస్తు ఈ తరుణంలో ప్రజా నాట్యమండలి సూర్యాపేట జిల్లా 3వ మహా సభలు ఈనెల 15న జరుగు మహాసభలను జయప్రదం చేయాలని కోరినారు. ఈ కార్యక్రమంలో బచ్చలకూర ప్రసాద్, సుధాకర్, వెంకటేశ్వర్లు, రాములు,సాయిలు,ఉమా, మహేశ్వరి, సాంసన్, విష్ణు, జెస్సికా, నరేష్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# కవయిత్రి మొల్ల మాంబ జయంతి వేడుకలు

**మునగాల మార్చి 13 ప్రజా జ్యోతి**

మునగాల శాలివాహన వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రముఖ కవయిత్రి మొల్ల మాంబ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మునగాల శాలివాహన వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సిరికొండ చంద్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. జయంతి సందర్భంగా శాలివాహన సొసైటీ సభ్యులు కలిసి కవయిత్రి మొల్ల మాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె తెలుగు సాహిత్యానికి చేసిన సేవలను



స్మరించుకున్నారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మొల్ల మాంబ వంటి గొప్ప కవయిత్రుల ఆదర్శాలను యువత అనుసరించాలని సూచించారు. తెలుగు సాహిత్యంలో ఆమెకు ఉన్న ప్రత్యేక స్థానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో మునగాల శాలివాహన సంఘ సభ్యులు, పెద్ద సంఖ్యలో పాల్గొని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# తెలుగు సాహిత్య ఆది కవయిత్రి మొల్ల

## ఘనంగా మొల్లమాంబ జయంతి

**పెన్ పహాడ్, మార్చి13 (ప్రజాజ్యోతి):**




తెలుగు సాహిత్య ఆదికవయిత్రి మొల్ల అని కుమ్మరి సంఘం నాయకులు నీలకంఠం జయరామకృష్ణ అన్నారు. తెలుగు తొలి మహిళా కవయిత్రి, మొల్ల రామాయణ సృష్టికర్త, ఆతుకూరి మొల్లమాంబ జయంతి వేడుకలు కుమ్మర సంఘం నాయకులు నీలకంఠం జయరామకృష్ణ ధరణి ల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొల్ల అసలు పేరు ఆతుకూరి మొల్లమాంబ అని,ఆమె16వ శతాబ్దపు తెలుగు కవయిత్రి అని, ఈమె కుమ్మరి కుటుంబంలో జన్మించిందనీ అన్నారు.మొల్ల శ్రీ కృష్ణదేవరాయ కాలంలోని వారని చరిత్రలో లిఖించబడి ఉన్నదని పేర్కొన్నారు. కవయిత్రి మొల్ల రాసిన రామాయణం 'మొల్ల రామాయణం'గా ఎంతో ప్రసిద్ధి చెందిందనీ,రామాయణాన్ని తెలుగులో రచించిన తొలి మహిళా రచయిత్రిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.ఇక మొల్ల రచనలను చదివినవారు మొల్ల రచనా శైలి చాలా సరళమైనదని, రమణీయమైనదని అంటారు. మొల్ల స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా,గోపవరం మండలం, గోపవరం గ్రామం.ఈ గ్రామం కడప పట్టణానికి 56 కి.మీ దూరంలో, బద్వేలుకు 5 కిలోమీటర్ల దూరంలో ఉంది.కొన్ని మూలాల ఆధారంగా మొల్ల స్వంతంత్ర భావాలు కలిగి ఉండేదని,చిన్న తనంలోనే తల్లిని కోల్పోగా తండ్రి కేసనశెట్టి ఈమెను గారాబంగా పెంచారని ఈమెకు తండ్రి అంటే అమిత ఇష్టంతో ఆయనను వదిలివెళ్ళల్సి వస్తుందని వివాహం కూడా చేసుకోలేదని చరిత్ర చెబుతుంది. మొల్ల రామాయణం మొత్తం ఆరు కాండాలలో 871 పద్యాలతో కూడుకుంది.ఈ కావ్యాన్ని మొల్ల కేవలం ఐదు రోజులలో రాసిందని ప్రతీతి.మొల్ల రచన ఆనాటి పద్ధతికి విరుద్ధంగా వాడుక భాషకు దగ్గరగా ఉండేదని సాహిత్యకారులు చెబుతుంటారని అన్నారు. కుమ్మరి ఆడపడుచును స్మరించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. అనంతరం పలువురు కుమ్మరి మహిళలకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి దండ సునంద వెంకట్ రెడ్డి, నీలకంఠం వెంకటేశ్వర్లు వసంత, నీలకంఠం సత్యం సరస్వతి, చలిగంటి పుల్లారావు, నీలకంఠం మహేష్ శోభ, నీలకంఠం మంగమ్మ, నీలకంఠం సైదులు, సలిగంటి మధు తదితరులు పాల్గొన్నారు.

# త్యాగానికి ప్రతీక రంజాన్

**బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉడుం కృష్ణ**

**మునగాల ,మార్చి13 ప్రజా జ్యోతి ):-**



త్యాగానికి సేవకు ప్రతిరూపం రంజాన్ పవిత్ర మాసం అని, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉడుం కృష్ణ అన్నారు, శుక్రవారం మండల కేంద్రంలోని మసీదు నందు నమాజ్ ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులకు బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు, అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అత్యంత భక్తితో అల్లాను ప్రార్థిస్తూ నెల రోజులపాటు ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరుల కోరికలు నెరవేరాలని, కుల మతాలకు అతీతంగా హిందూ ముస్లింలు ఐక్యతను చాటుతూ పండుగలు ఆచార సాంప్రదాయాలను పరస్పరం గౌరవించుకుంటూ కలిసిమెలిసి ముందుకు సాగాలని ఆయన కోరారు, పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు నిష్ట నియమంతో పాటించేనెలరోజుల ఒక్కపొద్దు ఉపవాస దీక్షలు విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు,ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎల్ పి రామయ్య, వేటశివాజీ,నాగబాబు, నరసింహారావు, గంధం మహేష్, రాజేష్, విజయ్, రవి, పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు ఎంపిక పరీక్షలు

**గరిడేపల్లి,మార్చి 13(ప్రజా జ్యోతి):**

తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్లో 4వ తరగతి ప్రవేశాల కోసం మండల స్థాయి ఎంపిక పరీక్షలు ఈ నెల 17న ఉదయం 9 గంటలకు జెడ్పీహెచ్ఎస్ గరిడేపల్లి పాఠశాలలో నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి పానుగోతు ఛత్రు నాయక్ తెలిపారు.శుక్రవారం మండల కేంద్రమైన గరిడేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఎంపికలో భాగంగా విద్యార్థులకు మొత్తం 9 మోటార్ క్వాలిటీ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వీటిలో హైట్,వెయిట్,30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్,స్టాండింగ్ బ్రాడ్ జంప్,800 మీటర్ల పరుగుపందెం, 6ఐ10 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బాల్ పుట్,వెర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ ఉంటాయని వివరించారు.ఇందులో ప్రతిభ కనబరిచిన 10 మంది బాలురు, 10 మంది బాలికలను జిల్లా స్థాయి ఎంపికలకు పంపిస్తామని తెలిపారు.అర్హతగా 01-09-2017 నుంచి 31-08-2018 మధ్య జన్మించిన నాలుగో తరగతి విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని చెప్పారు.ఆసక్తి గల విద్యార్థులు స్టడీ సర్టిఫికేట్,జనన ధృవీకరణ పత్రం,ఆధార్ కార్డు,కుల ధృవీకరణ పత్రం,ఐదు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో హాజరుకావాలని సూచించారు.విద్యార్థులు ముందుగా తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫిజికల్ డైరెక్టర్ బి.హుస్సేన్‌ను సంప్రదించాలని కోరారు.



# పరిశుభ్రత--తాగునీరు--పచ్చదనం పై ప్రత్యేక దృష్టి

## గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న యువ సర్పంచ్

**మునగాల, మార్చి 13 (ప్రజా జ్యోతి):**




గ్రామ అభివృద్ధిని ప్రధాన ధ్యేయంగా తీసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న మునగాల మండలం నారాయణగూడెం గ్రామానికి చెందిన యువ సర్పంచ్ కాంపాటి వెంకటేశ్వర్లు గ్రామ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన నాటి నుండి నేటి వరకు గ్రామంలోని ప్రతి సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజలతో మమేకమై పనిచేస్తున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటూ ప్రజల విశ్వాసాన్ని సంపాదిస్తున్నారు.గ్రామంలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ చెత్త తొలగింపు, డ్రైనేజీ శుభ్రత వంటి కార్యక్రమాలను చేపట్టి పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు కృషి చేస్తున్నారు. అలాగే గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపడుతూ నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచడానికి పర్యవేక్షణ చేస్తున్నారు.పచ్చదనం పెంపుకు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతూ గ్రామాన్ని హరితవనంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో చెట్లు నాటే కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నారు. గ్రామ పరిసరాలు స్వచ్ఛంగా, పచ్చగా ఉండేలా ప్రజలను చైతన్యపరుస్తూ గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిస్తున్నారు.అదే విధంగా పార్టీలకు అతీతంగా గ్రామంలోని ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తూ అందరినీ కలుపుకుని ముందుకు సాగుతున్నారు. గ్రామంలో ఎన్నాళ్లుగానో ఉన్న అపరిష్కృత సమస్యలను పరిష్కరించడమే కాకుండా భవిష్యత్తులో గ్రామం మరింత అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే పట్టుదలతో పనిచేస్తున్న యువ నాయకుడిగా కాంపాటి వెంకటేశ్వర్లు నిలుస్తున్నారు. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందిస్తూ పూర్తి సహకారం అందిస్తున్నారు. గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న యువ సర్పంచ్‌కు పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు.

# పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి



**గరిడేపల్లి,మార్చి 13(ప్రజా జ్యోతి):**

నేటి నుండి ఏప్రిల్ 15 వరకు నిర్వహించనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి పానుగోతు ఛత్రు నాయక్ తెలిపారు.శుక్రవారం ఆయన మండల కేంద్రమైన గరిడేపల్లి లో జడ్.పి.హెచ్.ఎస్, కేజీబీవీ పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.జడ్.పి.హెచ్.ఎస్ కేంద్రంలో 130,కేజీబీవి కేంద్రంలో 107 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.రెండు కేంద్రాల్లో సిఎస్‌లు,డీఓలు, ఇన్విజిలేటర్లు ఇతర సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు చెప్పారు.ఈ సందర్భంగ కేజీబీవీ విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షలను ధైర్యంగా రాసి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు.విద్యార్థులకు హాల్ టికెట్లను పంపిణీ చేశారు.అలాగే ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సెంటర్ సూపరి ంటెండెంట్లు రవీందర్ రెడ్డి,లింగయ్య,డీఓలు సత్యనారా యణ,శ్రీరామ్ రెడ్డి, ఎస్ఓ శైలజ,సిఆర్‌పి సాయిలు, రాతికింది రామకృష్ణ,అమరవరపు అశోక్ కుమార్ పాల్గొన్నారు.

# ఘనంగా కుమ్మరి మొల్లమాంబ జయంతి

**కోదాడ టౌన్, మార్చి13 (ప్రజా జ్యోతి):**




కోదాడ పట్టణంలోని రంగా థియేటర్ చౌరస్తాలో కుమ్మరి కులస్తుల ఆధ్వర్యంలో ప్రముఖ కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పదో వార్డ్ కౌన్సిలర్ మామిడి రామారావు, పలువురు నాయకులు హాజరై మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మొల్లమాంబ తెలుగు సాహిత్యానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సాధారణ ప్రజలకు సులభంగా అర్థమయ్యే భాషలో "మొల్ల రామాయణం" రచించి తెలుగు భాషకు గొప్ప కీర్తి తీసుకువచ్చారని తెలిపారు. ఆమె సాహిత్యం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని, యువత ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మొల్లమాంబ జయంతిని ప్రతి సంవత్సరం మరింత ఘనంగా నిర్వహించాలని కుమ్మరి సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం నాయకులు చలిగంటి రామారావు, పెద్దలు, యువకులు స్థానికులు పాల్గొన్నారు.

# నవభారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరీక్షా సామాగ్రి పంపిణీ

భువనగిరి,మార్చ్ 13 (ప్రజాజ్యోతి)

నవభారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణ మరియు మండలంలోని,ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 350,మంది పదవ తరగతి విద్యార్థులకు,పరీక్షా ప్యాడ్‌లు మరియు ఇతర పరీక్షా సామాగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమం రాయగిరి జెడ్‌పీ,హెచ్‌ఎస్ పాఠశాలలో జరిగింది.ముఖ్య అతిథులుగా డీఆర్‌డీవో పీడీ నాగిరెడ్డి డీఆర్‌డీవో,విజిలెన్స్ ఆఫీసర్ మందడి ఉపేందర్ రెడ్డి హాజరై,విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని తమ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అండాలు,నవభారత్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సరగడ కరుణ్,జెండర్ కోఆర్డినేటర్ రమణ,34వ వార్డు కౌన్సిలర్ సరగడ రాజ్యలక్ష్మి అమర్, 4వ వార్డు కౌన్సిలర్ అరుణ పూర్ణచం దర్,పలు పాఠశాలల హెచ్ ఎంలు,ఉపాధ్యాయులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అతిథులు గా వచ్చిన వారు మాట్లాడుతూ నవభారత్ యూత్ అసోసియేషన్ జిల్లాలో వివిధ సేవా కార్యక్ర మాలతో,పాటు ముఖ్యంగా విద్య,వైద్యం,క్రీడల రంగాల్లో ముందుండి,పనిచేస్తుండటం అభినంద నీయమని అన్నారు.అలాగే నవభారత్ యూత్ అసోసియేషన్, అధ్యక్షుడు సరగడ కరుణ్ మాట్లాడుతూ,జిల్లా సర్వతోముఖ అభివృద్ధి కోసంమా యూత్ ఎల్లప్పుడూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుం దని తెలిపారు.



# స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు మండల స్థాయి ఎంపిక పరీక్షలు

**మునగాల, మార్చి 13 (ప్రజా జ్యోతి):**

తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతి ప్రవేశాల కోసం మండల స్థాయి ఎంపిక పరీక్షలు ఈ నెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు మునగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ ఎంపిక పరీక్షలకు ఆసక్తి గల విద్యాస్టడీ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం మరియు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు ముందుగా తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ పరీక్షల ద్వారా క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులను ఎంపిక చేసి స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం కల్పిస్తారని చెప్పారు. మరిన్ని వివరాల కోసం క్రీడల ఉపాధ్యాయులు అజాం బాబాను సంప్రదించాలని కోరారు.



## బాల కార్మికులను బడిలో చేర్పించాలి

**సీనియర్ సివిల్ జడ్జ్ కే అనిత**

నాంపల్లి ,మార్చి 13,(ప్రజాజ్యోతి):పిల్లలతో పని చేయించడం చట్టరీత్యా నేరమని, బాల కార్మికులను బడిలో చేర్పించాలని దేవరకొండ మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్ పర్సన్, సీనియర్ సివిల్ జడ్జ్ కే అనిత తెలిపారు. జిల్లా జడ్జి, చైర్మన్ జిల్లా న్యాయ సేవా సంస్థ ఎం నాగరాజు ఆదేశాలు మేరకు శుక్రవారం నాంపల్లి మండలంలోని పసునూరు లో ఎల్ వీ ఎం, ఎల్ ఎన్ ఎస్ ఇటుక బట్టీలలో, దేవత్ పల్లి గ్రామంలోని ఇటుక బట్టీలను రెవెన్యూ, లేబర్, ఎడ్యుకేషనల్,సి డబ్ల్యూ సి, పోలీస్ శాఖల అధికారులతో కలిసి వారు తనిఖీ చేశారు. ఒరిస్సా,ఆంధ్రప్రదేశ్ కు చెందిన బాల కార్మికుల వారి తల్లిదండ్రులతో ఇటుక బట్టి యజమానులకు తగు సూచనలు ఇచ్చి, బాల కార్మికులను బడిలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్ పర్సన్ ఆదేశానుసారం అధికారులు ఇటుక బట్టీలో ఉన్న బాల కార్మికులను వారి గ్రామాలలో పాఠశాలలో చేర్పించేలా న్యాయశాఖ అధికారులు తగు చర్యలు తీసుకున్నారు.



# పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి: డీఈవో

నాంపల్లి,మార్చి,13(ప్రజా జ్యోతి):పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం బిక్షపతి అధికారులు ఆదేశించారు. శుక్రవారం నాంపల్లి మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ నేటి నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి వార్షిక పరీక్షల విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవకతవలకు తావు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు గంట ముందే చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి మల్లికార్జున రావు, జిహెచ్ఎంసి ప్రధానోపాధ్యాయులు అజయ్ కుమార్, చీప్ సూపరిండెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు

**కోదాడ టౌన్, మార్చి13(ప్రజా జ్యోతి):**

కోదాడ పరిధిలోని శనగల రాధాకృష్ణ దివ్యాంగుల ఆశ్రమంలో తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర జాగృతి గిరిజన వైస్ ప్రెసిడెంట్ భూక్య సంజీవ్ నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఆశ్రమంలోని దివ్యాంగులకు అన్నదానం నిర్వహించి, కేక్ పంపిణీ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాలతో జరిపారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు దివ్యాంగులతో కలిసి సమయం గడిపి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమాజ సేవలో ముందుంటూ పలు సేవా కార్యక్రమాలు



నిర్వహిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. ఆమె జన్మదిన వేడుకలను దివ్యాంగుల మధ్య జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సమాజంలోని బలహీన వర్గాల పట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధ్యక్షులు వీరగాని సాయి, బిసి మహిళా జిల్లా అధ్యక్షురాలు గీత, బానోతు వాసు, శేఖర్ రెడ్డి, మోతే మండల యువజన అధ్యక్షులు ధరావత్ కృష్ణ, రాము మహేష్ బూరుగడ్డ రఘు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు పది పరీక్షల్లో 10 జీపీఏ సాధించాలి

## నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి

## కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బొట్టుగూడ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

**నల్లగొండ మార్చి 13 (ప్రజా జ్యోతి)**







పదవ తరగతి పరీక్షల్లో ప్రతీక్ ఫౌండేషన్ ప్రభుత్వ పాఠశాల బొట్టుగూడు హైస్కూల్ విద్యార్థులు 10 జిపిఏ సాధించి చదువుకున్న పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బురి శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు. జిల్లా కేంద్రంలోని కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బొట్టుగూడ 10వ తరగతి విద్యార్థులకు కోమటిరెడ్డి ప్రతిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలలో ఫ్యాడ్, పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేద విద్యార్థులకు కార్పొరేటర్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించాలని ఉద్దేశంతో తన సొంత నిధులు రూ.8.50 కోట్లతో ఎక్కడలేని విధంగా ఈ పాఠశాలను నిర్మించి అదే స్థాయిలో సౌకర్యాలు కల్పించాడని అన్నారు.పాఠశాలలో చదువుతున్న 10 తరగతి విద్యార్థులు 10 జిపిఎస్ సాధించి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి గిఫ్ట్ ఇవ్వాలనికోరారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విద్యార్థుల నుంచి ఆశించేది అదేనని అన్నారు.ఈ సందర్భంగా 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు బెస్ట్ విషెస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రతిక్ ఫౌండేషన్ సీఈవో ఎం.గోనా రెడ్డి , పాఠశాల హెచ్ఎం రామకృష్ణ, రిటైర్డ్ ప్రిన్సిపల్ సుధారాణి, సలీం, గిరిబాబు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

## జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

## పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ (144)అమలు

## పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ షాపులు మూసివేత

## పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేవిదంగా చూడాలి

**నల్గొండ మార్చి 13 (ప్రజా జ్యోతి)**

జిల్లాలో ఈ నెల 14వ తేదీ నుండి వచ్చే నెల 16 వరకు పదవ తరగతి వార్షిక పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు కల్పించినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ..జిల్లాలో నిర్వహించబడుతున్న పదవ తరగతి పరీక్షలు ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. పరీక్షల నిర్వహణ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తమ హాల్ టికెట్‌లో పేర్కొన్న సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఎస్పీ సూచించారు.పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో గుంపులు గుంపులుగా చేరకుండా ఉండేందుకు జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలు చేయనున్నట్లు అలాగే 500 మీటర్ల పరిధిలో ప్రజలు గుమిగూడరాదని,ఎస్పీ తెలిపారు.పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు మరియు ఫోటోకాపీ దుకాణాలను తాత్కాలికంగా మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్పీ తెలిపారు.పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ట్యాబ్‌లు, పెన్ డ్రైవ్‌లు,ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు.

పరీక్షా సమయాల్లో పరీక్షా కేంద్రాల సమీపంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులను నియమించనున్నట్లు తెలిపారు. అలాగే పరీక్షల నిర్వహణకు సంబంధించి ఎలాంటి అనుమానాస్పద చర్యలు గమనించినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా మరియు విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు.



# ప్రజా ప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి...!

## అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలులో పార్టీలకతీతంగా కలిసికట్టుగా కృషి చేద్దాం

## 'నేను..నా మిర్యాలగూడ' అందరి అభిమతం కావాలి

## - ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

**మిర్యాలగూడ, మార్చి 13,( ప్రజాజ్యోతి ):**

ప్రజా ప్రతినిధులు ప్రజలకు జవాబు దారితనంతో పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్)కోరారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడు టిఎన్ఆర్ గార్డెన్స్ నందు నిర్వహించిన మిర్యాలగూడ నియోజకవర్గ స్థాయి ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక అమలుపై సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్,జిల్లా కలెక్టర్ బి. చంద్ర శేఖర్ లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలు శాఖల జిల్లా స్థాయి అధికారులు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99




రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా నిర్వహించే పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు.అనంతరం ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి దూరదృష్టితో పల్లెలను,పట్టణాలను అభివృద్ధి పరంగా ఉన్నతంగా ఉంచాలనే సంకల్పంతో నూతనంగా శ్రీకారం చుట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉన్నదన్నారు.ముఖ్యంగా గ్రామాల్లో, మండలాల్లో మున్సిపాలిటీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించివాటిని పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు.మూడు నెలల పాటు ప్రజా ప్రతినిధులను, అధికారులను ప్రజలకు దగ్గర చేసి అభివృద్ధి, సంక్షేమ పథకాలలో భాగస్వామ్యం చేసే ఈ కార్యక్రమం చాలా ఉన్నతమైందన్నారు. కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ప్రజా సేవ చేసే అవకాశం ఉన్న కార్యక్రమం ఇదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా 99 రోజులపాటు చేపట్టాల్సిన ప్రజాహిత కార్యక్రమాలనుపకడ్బందీగా నిర్వహించేందుకు అందరం కట్టుబడి ఉండాలన్నారు. సమస్యలు ఎక్కడ ఉన్నా వాటిని గుర్తించి పరిష్కారానికి అయ్యే ఖర్చును అంచనావేసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాల్సి ఉందన్నారు.తద్వారా ప్రభుత్వ నిధులతో సమస్యలనుసమూలంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు.ఎన్నుకున్న ప్రజలకు జవాబుదారీగా ప్రజాప్రతినిధులు ఉండాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అందరం కలిసి విజయవంతం చేద్దామ న్నారు.రాజకీయాలు, పార్టీలు ఎన్నికల వరకేనని,అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు విషయంలో అందరూ సమానమేనన్నారు. మిర్యాలగూడ అభివృద్ధి విషయంలో ఏ పార్టీ వాళ్ళైనా ఎవరైనా సరే నేరుగా సంప్రదించవచ్చు




అన్నారు.ఎవరు ఏమనుకున్నా,ఎన్ని అనుకున్నామిర్యాలగూడ అభివృద్ధి మనందరి లక్ష్యం కావాలన్నారు. ముఖ్యంగా వేసవికాలం వచ్చినందున ఎక్కడ కూడా తాగునీటి సమస్య ఏర్పడకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన కర్తవ్యం మనందరిపై ఉన్నదని,నీటి ఎద్దడి ఏర్పడిన ప్రాంతాలను ముందస్తుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లనుచేయాలన్నారు.విద్యుత్ సమస్యలు పరిష్కరించి,లో వోల్టేజ్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. మున్సిపాలిటీ కార్మికులు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు,దోమల నివారణకు మెరుగైన పారిశుధ్యం కోసం ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. కనీస సౌకర్యాలైన రోడ్లు,విద్యుత్,పారిశుద్ధ్యం,డ్రైనేజ్ వంటి అంశాలకు ముందుగా ప్రాధాన్యతనిచ్చి ఒక్కొక్కటిగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. అంతేగాక కోతులు కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించేందుకు అవంతీపురం గ్రామం వద్ద ఏర్పాటు చేసిన ఏబీసీ సెంటర్ నిర్మాణపనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసిఅందుబాటులోకి తీసుకురావాలి అని అధికారులను కోరారు.

మిర్యాలగూడ నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికి విద్యా,వైద్యం అందించేందుకు అందరం సమిష్టిగా కృషి చేద్దామన్నారు."నేను..నా మిర్యాలగూడ "అనే నినాదం అందరి అభిమతం కావాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. 99 రోజులపాటు జరిగే కార్యక్రమాన్నివిజయవంతం చేసేందుకు ప్రజలంద రూ సహకరించాలి అని కోరారు.ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు ప్రభుత్వం సూచించిన విధంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్ర మాల్లోపాలుపంచుకోవాలి అని సూచించారు.

మిర్యాలగూడఅభివృద్ధికి, ప్రాంత ప్రజల సంక్షేమానికి అందరూ సహకరించాలి అని సూచించారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డి.ఎస్.పి కె రాజశేఖర్ రాజు, డిసిసి అధ్యక్షుడు పున్నా కైలాష్ నేత, మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్ పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, మిర్యాలగూడ నియోజకవర్గ సర్పంచ్ లు, కౌన్సిలర్స్, ఉప సర్పంచ్ లు, వార్డ్ మెంబర్స్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# తిమ్మాపురం ఫిడర్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



**దామరచర్ల ,మార్చి 13,( ప్రజాజ్యోతి ):**

మరమ్మత్తుల కారణంగా శనివారం నాడుమండలం లోని తిమ్మాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని ఫీడర్లకు ఉదయం11:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ ఏ ఈ అబ్దుల్లా హబీబ్ శుక్రవారం తెలిపారు . ఆయా ఫీడర్ల పరిధిలోని గృహ, వాణిజ్య మరియు ఇండస్ట్రియల్ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి మరియు అధికారులకు సహకరించగలరని కోరారు.

# విద్యార్థులు యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి - ఎస్ఐ హనుమ నాయక్.

**చిలుకూరు మార్చి 13:( ప్రజా జ్యోతి )**

విద్యార్థులు యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరాలని మంచి ఫలితాలు సాధించాలని చిలుకూరు ఎస్సై హనుమ నాయక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా రక్షణ పరమైన అంశాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని దీనిలో భాగంగానే శుక్రవారం మండల కేంద్రం లోని గ్లోబస్ పాటశాల నందు విద్యార్థులకు చట్టాల గురించి సత్ప్రవర్తన గురించి లక్ష్యాల గురించి వివరించామన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కష్టపడి చదువుకోవాలని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలని అన్నారు. తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఒత్తిడి లేకుండా చదవాలని పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలని




సూచించారు. సైబర్ మసాలా బారిన పడకుండా రోడ్డు ప్రమాదాలకు గురవకుండా విద్యార్థులు తల్లిదండ్రులను సమాజంలో ఉన్న వ్యక్తులను చైతన్య పరచాలని కోరారు. ప్రతి ఒక్కరికి సామాజిక అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వ్యక్తిగత సమాచా న్ని అపరిచితులకు తెలపడం వల్లనే సైబర్ మోసాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బేతవోలు లో మొలమాంబ జయంతి వేడుకలు



చిలుకూరు మార్చి 13:( ప్రజా జ్యోతి )

మండల లోని బేతవోలు గ్రామంలో తొలి తెలుగు నవల కావిత్రి మొలమాంబ జయంతి ఉత్సవాలు శుక్రవారం ఫ్లెక్సీ ఏర్పాటు చేసి మూలమాంబ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు,ఈ సందర్భంగా కుమ్మరి కుల సభ్యులు పాల్గొని వారు మాట్లాడుతూ, ఆమె తెలుగు సాహిత్యానికి చేసిన సేవలను స్మరించుకుంటూ ఆమె ఆశయాలను కొనియాడారు,వచ్చే సంవత్సరం మూలమాంబ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఈ కార్యక్రమానికి అందరూ సహకరించాలని కోరారు, ఈ కార్యక్రమంలో, వార్డు మెంబర్ పొరల పెద్దమట్టయ్య, పొరల ఉపేందర్, సోమయ్య, లక్ష్మయ్య, నాగేశ్వరరావు, వీరబాబు, వెంకటేష్, నిరంజన్, పరశురాం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు,

# పి యం శ్రీ జెడ్పి ఉన్నత పాఠశాల ను ఎంఈవో ఆకస్మిక తనిఖీ

చిలుకూరు మార్చి 13: ( ప్రజా జ్యోతి )

పాఠశాలలో ఓ విద్యార్థిగా విద్యాభ్యాసం చేశాడు. ఆ తరువాత ఉన్నత చదువులు చదివి ప్రస్తుతం మండల విద్యాశాఖ అధికారిగా అదే మండలంలో నియమితులయ్యారు. ఆయనే చిలుకూరు మండల ఎంఈవో గుజ్జుల నర్సింహారెడ్డి. ఆయన శుక్రవారం ఓ అధికారిగా తనకు విద్యాబుద్ధులు అందించిన చిలుకూరు పీఎంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాలలో అధికారిక తనిఖీలు నిర్వహించారు. విద్యాబోధన, విద్యార్థుల క్రమశిక్షణ, మధ్యాహ్న భోజన నిర్వహణ తదితరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గుజ్జుల




మాట్లాడుతూ.. ఈ పాఠశాల తన భవితను నిర్దేశించిందని, ఆనాటి గురువుల ఆప్యాయ పూరితమైన బోధనతో తాను ఈనాడు ఈ స్థాయికి చేరుకున్నానని గత స్మృతులు గుర్తు చేసుకున్నారు. తన సహాధ్యాయి, పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు కైలాసం వెంకటేశ్వర్లును ఆప్యాయంగా పలకరించారు. విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తును అందించాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు. ఉపాధ్యాయ బృందం ఆయనను సన్మానించింది. ఈ కార్యక్రమంలో ,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజారామ్, ఉపాధ్యాయులు అంకిరెడ్డి, సజ్జన కుమారి, కస్తూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధులు, అధికారులందరు కలిసికట్టుగా పనిచేస్తే అభివృద్ధి

### నూతన ప్రజాప్రతినిధులు గ్రామాలలో పర్యటించి, సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలి

### జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

### మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి

### ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్సీ శంకర్ నాయక్



నల్లగొండ మార్చి 13 (ప్రజా జ్యోతి ప్రతినిధి )

నూతన ప్రజాప్రతినిధులు గ్రామాలలో పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా శుక్రవారం నల్గొండ జిల్లా, మిర్యాలగూడ  లో నిర్వహించిన మిర్యాలగూడ నియోజకవర్గస్థాయి ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 99 రోజులపాటు నిర్వహించవలసిన కార్యక్రమాలను షెడ్యూల్




ప్రకారం రూపొందించి పది ప్రధాన అంశాలను తీసుకొని వాటి పై అవగాహనతో పాటు,సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే కాకుండా, ఇప్పటివరకు ప్రభుత్వం సాధించిన అభివృద్ధి పై ప్రజలకు తెలియజేసేందుకు చేపట్టడం జరిగిందని వెల్లడించారు. ఇందులో భాగంగా మార్చి 6 నుండి 15 వరకు అన్ని గ్రామాలు, పట్టణాలు, కార్యాలయాలలో పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టేందుకు నిర్దేశించడం జరిగిందని, అంతేకాక అన్ని ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కారం చేపట్టినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు గ్రామాలలో పర్యటిస్తే సమస్యలు తెలుస్తాయని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీడీవోలు గ్రామ వారీగా ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాబితాను రూపొందించి ఏప్రిల్ 2 న నిర్వహించనున్న గ్రామసభలలో వాటిని చదివి వినిపించాలని, అదేవిధంగా ప్రభుత్వం అమలుచేసే అభివృద్ధి ,సంక్షేమ కార్యక్రమాలను గ్రామసభలలో,మున్సిపల్ పట్టణాలలో చర్చించాలన్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల ను పెద్ద ఎత్తున చేపట్టడం జరిగిందని, ఎల్ -3 నుండి ఎల్- 1 కు వచ్చిన కొన్ని ఇండ్ల సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తున్నామని , ఉగాది నాటికి సామూహిక ఇందిరమ్మ గృహప్రవేశాలను చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 14 నుండి జరిగే ఎస్ ఎస్ సి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని ,జిల్లా వ్యాప్తంగా విద్యార్థులందరూ 10 వ తరగతి పరీక్షలలో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాలన్నారు. పశ్చిమాషియా యుద్ధ నేపథ్యంలో నెలకొన్న ఎల్పీజీ గ్యాస్ కొరతపై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో డొమెస్టిక్ సిలిండర్ల కు ఎలాంటి కొరత లేదని, వాణిజ్యపరమైన సిలిండర్లకు మాత్రమే కొరత ఉందని అందువల్ల ప్రజలు అపోహలను నమ్మవద్దని, దళారీల మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు. ఎల్పిజి గ్యాస్ సరఫరా విషయమై గురువారమే ఎల్పిజి గ్యాస్ ఏజెన్సీలతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగిందని, జిల్లాలో డొమెస్టిక్ ఎల్పిజి గ్యాస్ కనెక్షన్లను అక్రమంగా కమర్షియల్ కు వాడిన 16 మందిపై కేసులు నమోదు చేయడం జరిగిందని ఆయన వెల్లడించారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ ఉద్దేశాలు, మార్గదర్శకత్వాన్ని నెరవేర్చే విధంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో ప్రతి ఒక్కరూ పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

సమావేశానికి అధ్యక్షత వహించిన మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు,అధికారులందరు కలిసికట్టుగా పనిచేసి మిర్యాలగూడ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందు నిలపాలన్నారు.మిర్యాలగూడ వాణిజ్యపరంగా ముందున్నప్పటికీ అనేక మంది పేదవారు ఉన్నారని, వారికి విద్య ,వైద్యానికి పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ తో కోరారు. యూరియాకు సంబంధించి మండలాల వారీగా కాకుండా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వారిగా తమకు కేటాయించాలని, వైటిపిఎస్ కు సంబంధించిన సిఎస్ఆర్ నిధులను అభివృద్ధి పనులకు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా నూతన ప్రజాప్రతినిధులు గ్రామాలు, మండలాలలో పర్యటించి సమస్యలు గుర్తించి పరిష్కరించాలని, అంతేకాక సమస్యల పరిష్కారానికి అవసరమయ్యే నిధుల అంచనాలను రూపొంది సమర్పించాలని, అందరూ కలిసికట్టుగా పనిచేస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రజాభివృద్ధే అందరి లక్ష్యం కావాలని, నియోజకవర్గంలో తాగునీరు, విద్యుత్తు సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అందరికీ విద్య, వైద్యం అందుబాటులో ఉంచడమే తమ లక్ష్యమని, ప్రజా సంక్షేమాన్ని బాధ్యతగా తీసుకోవాలని, రాజకీయాల కతీతంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. రాబోయే రోజుల్లో మిర్యాలగూడ పట్టణంలో ఈఎన్టి ఆసుపత్రి,ప్రస్తుత ఆసుపత్రిని స్థాయి పెంచడం, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యల పరిష్కారం, రింగ్రోడ్డు ఏర్పాటు, విద్య ,వైద్యానికి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం వంటి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతున్నదని, పేదలు, అట్టడుగు వర్గాల అభివృద్ధికి తమ ప్రభుత్వం గతం నుండి ఎన్నో. సంస్కరణలు తెచ్చిందని తెలియజేశారు. మున్సిపల్ చైర్మన్ సుధ,వైస్ చైర్మన్ ,డిసి సి అధ్యక్షులు వున్న కైలాష్ నేత తదితరులు మాట్లాడారు.ఈ సందర్బంగా వివిధ శాఖల అధికారులు ప్రభుత్వ ప్రాధామ్య అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రజా ప్రతినిధులకు వివరించారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, మున్సిపల్ కమిషనర్,జిల్లా అధికారులు హాజరయ్యారు.



# మూడు కోట్ల పది లక్షల రూపాయల క్లైమ్స్ చెల్లించాం

## ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆరోగ్య భీమా తీసుకోవాలి సీనియర్ సేల్స్ మేనేజర్ చల్లా శ్రీనివాసరావు



**కోదాడ టౌన్,మార్చి13 (ప్రజా జ్యోతి):**

కోదాడ ఎస్ఎమ్ స్టేషన్ పరిధిలో 370 మంది ఆరోగ్య బీమా పాలసీదారులకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికీ 3 కోట్ల 10 లక్షల రూపాయల క్లైమ్స్ చెల్లించామని స్టార్ హెల్త్ కోదాడ సీనియర్ సేల్స్ మేనేజర్ చల్లా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం కోదాడ పట్టణంలోని వారి కార్యాలయంలో వరంగల్ జోనల్ ట్రైనర్ హెడ్ గోపాల కరుణాకర్ తో కలిసి ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ప్రతి ఒక్కరికి ఆరోగ్య భద్రత ఉండాలనే సంకల్పంతో బీమాపై పూర్తిగా జిఎస్టి తొలగించిందని వైద్యం ఖర్చులు రోజురోజుకీ పెరుగుతున్న ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కుటుంబానికి సరిపడా ఆరోగ్య బీమా తీసుకోవాలన్నారు. గోపాల కరుణాకర్ మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బులిటీ తో తమ సంస్థ దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 4న 32 ఉచిత ఆరోగ్య సేవా కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. తెలంగాణలో నిజామాబాద్,ఖమ్మం, మహబూబ్ నగర్,కరీంనగర్ లో ఏర్పాటు చేశామని ఇట్టి సేవ కేంద్రాల్లో ఉచితంగా ఓపి, పరీక్షలు, మందులు, వ్యాక్సినేషన్ అందిస్తామని ఇట్టి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# శాస్త్రీయ ఆలోచనలతోనే ఉజ్వల భవిష్యత్తు

## రేపటి శాస్త్రవేత్తలు విద్యార్థులే

## ఎస్. వి. విద్యా సంస్థల చైర్మన్ ముత్తినేని సైదేశ్వరరావు



**కోదాడ టౌన్, మార్చి13 (ప్రజా జ్యోతి):**

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్ ఒక అద్భుతమైన వేదిక అని ఎస్వీ విద్యాసంస్థల చైర్మన్ ముత్తినేని సైదేశ్వరరావు అన్నారు. శుక్రవారం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ గర్ల్స్ జూనియర్ కాలేజ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ ప్రదర్శనను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథంతోనే నూతన ఆవిష్కరణలు సాధ్యమవుతాయని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ప్రిన్సిపాల్ పుల్లారి వెంకట నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ప్రదర్శించిన నమూనాలు ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో అకాడమిక్ ఇంచార్జ్ గోవర్ధన్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు నాంచారయ్య,కన్నయ్య రాయుడు,రవీందర్ నాయక్, ఇంగ్లీష్ వెంకన్న,ఆంజనేయులు,దుర్గా ప్రసాద్ వెంకట్,వెంకట రెడ్డి,శాంత కుమారి, రాజేశ్వరి, జ్యోత్స్న సందీప్, కిరణ్మయి, కావ్య, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

# పదోతరగతి విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థానాలకు చేరతారు.. వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న




**మోత్కూర్ మార్చి 13 (ప్రజాజ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ పదోతరగతి విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగవచ్చని మోత్కూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న అన్నారు. మోత్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 103 మంది విద్యార్థులకు పరీక్షల నేపథ్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు మరియు ఇతర అవసరమైన సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతి దశ విద్యార్థుల జీవితంలో కీలకమైందని, ఈ సమయంలో పట్టుదలతో చదివితే భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు భయపడకుండా ధైర్యంగా పరీక్షలను ఎదుర్కొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు అందిస్తున్న మార్గదర్శకాన్ని పాటిస్తూ కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవినేని అరవిందరాయుడు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్‌పర్సన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జీఎంఆర్ ఫంక్షన్ హాల్ అధినేత

**మోత్కూర్ మార్చి 13 (ప్రజాజ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం స్వప్న సోమా నర్సయ్య గారిని మోత్కూర్‌లోని జీఎంఆర్ (జిఎంఆర్) ఫంక్షన్ హాల్ అధినేత గట్టు మధుసూదన్ రావు దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు తెలియజేసి పట్టణ అభివృద్ధి



విషయాలపై స్వల్పంగా చర్చించారు. మోత్కూర్ పట్టణ అభివృద్ధి కోసం మున్సిపాలిటీ చేపడుతున్న కార్యక్రమాలను వారు అభినందించారు. అలాగే ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాల్లో తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గడ్డం స్వప్న సోమా నర్సయ్య వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# రోడ్డు ప్రమాదంలో సర్వేలు తపాలా ఉద్యోగి భూసా వెంకటేశ్వర్లు మృతి

## ఉత్తరాలు పంచడానికి వెళ్లి ప్రమాదానికి గురి





**సంస్థాన్ నారాయణపురం,**

మార్చి 13, (ప్రజాజ్యోతి) : విధి నిర్వహణలో భాగంగా ఉత్తరాలను పంచడానికి వెళ్లిన గ్రామీణ డాక్ సేవక్ (తపాలా ఉద్యోగి) భూసా వెంకటేశ్వర్లు( 62) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్ గ్రామానికి చెందిన భూసా వెంకటేశ్వర్లు సర్వేల్ పోస్ట్ ఆఫీస్ లో గ్రామీణ డాగ్ సేవక్ గా ఉద్యోగం చేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం ఏడు గంటల సమయంలో సర్వేల్ గ్రామపంచాయతీ పరిధిలోని దేవిరెడ్డి గూడెం గ్రామంలో ఉత్తరాలను పంపిణీ చేశాడు. అనంతరం మరో ఊరికి వెళ్లడానికి దేవిరెడ్డి గూడెం క్రాస్ రోడ్డు నుంచి కొత్తగూడెం వైపు బైక్ పై మళ్లీ వెళ్తున్నాడు. ఇంతలోనే హైదరాబాదు నుంచి మునుగోడు వైపు వెళుతున్న మహేంద్ర కంపెనీకి చెందిన జీప్ కం కార్ ( టీఎస్ 07 ఎఫ్ యు 0926) నంబర్ గల వాహనం అతివేగంగా వచ్చి భూసా వెంకటేశ్వర్లను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో భూసా వెంకటేశ్వర్లుకు కాళ్లు విరిగి తీవ్ర గాయాలకు గురై దూరంగా ఎగిరిపడ్డాడు. ఈ ప్రమాదం వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీనితో ఎస్సై జగన్ ఆధ్వర్యంలో పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి వచ్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం భూసా వెంకటేశ్వర్లు మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ అనిల్ ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్సై జగన్ తెలిపారు. ఇది ఇలా ఉండగా డాగ్ సేవకు సిబ్బంది విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదానికి గురై మరణించిన భూసా వెంకటేశ్వర్లు కు సంతాపం తెలిపారు. అనే కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



# పాఠశాలకు ఫ్రిడ్జ్ బహుకరణ అభినందనీయం

## తెలంగాణ పర్యాటకశాఖ చైర్మెన్ పటేల్ రమేష్ రెడ్డి



పెన్‌పహాడ్ మండలం మార్చి13(ప్రజా జ్యోతి): మండలంపరిధిలోని దోస పహాడ్ గ్రామంలోని మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో స్ప్రెడ్ ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్రిడ్జ్‌ను తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ శ్రీ పటేల్ రమేష్ రెడ్డి ప్రారంభించారు. స్ప్రెడ్ ఇంటర్నేషనల్ సంస్థ చైర్మన్ డాక్టర్ శ్రీ పటేల్ శ్రీధర్ రెడ్డి సహకారంతో సుమారు నలభై వేల రూపాయల వ్యయంతో ఈ ఫ్రిడ్జ్‌ను పాఠశాలకు అందజేశారు. గురుకుల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థినులకు అవసరమైన వంట సామాగ్రి, కూరగాయలు మరియు ఇతర ఆహార పదార్థాలను సురక్షితంగా నిల్వ చేసుకోవడానికి ఈ ఫ్రిడ్జ్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మంచి వాతావరణంలో విద్యను అభ్యసించేలా సౌకర్యాలు కల్పించడం సమాజం బాధ్యత అని అన్నారు. విద్యార్థినుల ఆరోగ్యం, సౌకర్యం మరియు విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్ప్రెడ్ ఇంటర్నేషనల్ సంస్థను ఆయన అభినందించారు. అదేవిధంగా, టెన్త్ పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని సూర్యాపేట జిల్లా కలెక్టర్ విద్యార్థులకు ఎగ్జామ్ కిట్లు (ప్యాడ్స్, పెన్స్) పంపిణీ చేయడం జరిగింది. ఈ కిట్లను రమేష్ రెడ్డి స్వయంగా విద్యార్థినులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థినులు కష్టపడి చదివి పరీక్షలను ధైర్యంగా రాయాలని, మంచి ఫలితాలు సాధించి తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు మరియు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం విద్యార్థుల అభ్యున్నతికి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది, వార్డు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# శిక్షణ పొందిన అడ్వైజర్లతోనే పాలసీలు తీసుకోవాలి

జోనల్ హెడ్ ట్రైనర్ గోపాల కరుణాకర్



కోదాడ టౌన్, మార్చి13 ( ప్రజా జ్యోతి): ప్రజలు ఇన్సూరెన్స్ పాలసీల కొనుగోలు విషయంలో అప్రమత్తంగా ఉండాలని, శిక్షణ పొందిన ఇన్సూరెన్స్ అడ్వైజర్లనే సంప్రదించాలని జోనల్ హెడ్ ట్రైనర్ గోపాల కరుణాకర్ తెలిపారు. శుక్రవారం కోదాడలో ఆయన ప్రత్యేకంగా వరంగల్ నుంచి వచ్చి ఇన్సూరెన్స్ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోని రాణిస్తున్న ఎస్. ఎస్. శ్రీనివాసరావుకు బీమా నియమ నిబంధనలలో వచ్చిన మార్పులపై అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబానికి ఆరోగ్య మరియు జీవిత బీమా ధీమా ఉండాలని, అది ఆపత్కాలంలో గొప్ప చేయూతనిస్తుందని పేర్కొన్నారు. నిరంతరం శిక్షణ పొందే అడ్వైజర్లు మాత్రమే కస్టమర్లకు మెరుగైన అవగాహన కల్పించగలరని వెల్లడించారు. ఈ సందర్భంగా పాలసీదారుల యోగక్షేమాలు తెలుసుకుంటూ మెరుగైన సేవలందిస్తున్న ఎస్ఎస్ శ్రీనివాసరావును ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

# కవయిత్రి మొల్లమాంబ జీవితం ఆదర్శం

కుమ్మరి సంఘం అధ్యక్షుడు సిలివేరు నరసింహ

సంస్థాన్ నారాయణపురం,



మార్చి 13, (ప్రజాజ్యోతి) : రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ జీవితం అందరికీ ఆదర్శమని సంస్థాన్ నారాయణపురం గ్రామ కుమ్మరి సంఘం అధ్యక్షుడు సిలివేరు నరసింహ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో శుక్రవారం కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. మొల్లమాంబ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు కుమ్మరి సంఘం నాయకులు మాట్లాడుతూ పట్టుదలతో మొల్లమాంబ చదువు నేర్చుకోవడమే కాక రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన గొప్ప వ్యక్తి అన్నారు. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి శతాబ్దాల క్రితమే చదువుకున్న గొప్ప వ్యక్తి అన్నారు. ఆమె జీవితం నేటి తరానికి ఆదర్శం అన్నారు. ఆమె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం కుమ్మరి సంఘం ప్రధాన కార్యదర్శి చెలివేరి వెంకటేశం, కోశాధికారి సిలివేరు సైదులు, మరి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిలువేరు అంజయ్య, సంఘం మాజీ అధ్యక్షుడు చిలువేరు అంజయ్య, శివాలయం కమిటీ అధ్యక్షుడు చిలువేరు శంకర్, నాయకులు తెలంగాణ బిక్షం, లారీ బిక్షం, సంజీవ, బిక్షమయ్య, సోమయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

అడ్డగూడూరు మార్చి 14 (ప్రజా జ్యోతి)..

అడ్డగూడూరు మండలంలోని చౌల్లరామారం ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 11 మంది విద్యార్థులకు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి సౌజన్యంతో పరీక్ష ప్యాడ్లు పెన్నులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులు గురువులు



మరియు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య, బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు మెట్టు భాస్కర్ రెడ్డి, సర్పంచ్ మందుల రేణుక కిరణ్, ఉపసర్పంచ్ తోట కృష్ణారెడ్డి, నాయకులు తోట భాస్కర్ రెడ్డి, కోడల బయ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# గంగమూల తండాలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సంస్థాన్ నారాయణపురం,

మార్చి 13, (ప్రజాజ్యోతి) : సంస్థాన్ నారాయణపురం మండలం గంగ మూల తండా గ్రామంలో శుక్రవారం 5 లక్షలతో నిర్మాణం చేస్తున్న సిసి రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ లచ్చు నాయక్ ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ లచ్చు నాయక్ రోడ్డు మంజూరు చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ మెగావత్ బిచ్చ నాయక్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# 99వ ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా చెరువులు, కుంటల

## శుభ్రపరిచే కార్యక్రమం



నార్కట్ పల్లి, మార్చి 13 ( ప్రజా జ్యోతి):మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో 99వ ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని చెరువులు, కుంటలను శుభ్రపరిచే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్ శుక్రవార ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ భరత్ మాట్లాడుతూ... గ్రామంలో నీటి నిల్వలు స్వచ్ఛంగా ఉండేలా, వర్షాకాలంలో నీరు సులభంగా నిల్వ ఉండేలా చెరువులు, కుంటలలో పేరుకుపోయిన మట్టిని, చెత్తను తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ భరత్ అన్నారు . ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శిరీష ప్రవీణ్ రెడ్డి , వార్డు సభ్యులు వడ్డెగోని రామలింగం , అమనగంటి ఐలయ్య , జిల్లా మహేష్, బషీర్, మాదాసు నర్సింహా , మట్టపల్లి నాగరాజు ,గ్రామ పంచాయతీ సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొని చెరువులు, కుంటలను శుభ్రపరిచే పనుల్లో సహకరించారు గ్రామ అభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ జేరిపోతుల భరత్ కుమార్ గారు కోరారు.

# హోటల్ ప్రారంభించిన సర్పంచ్ భరత్ కుమార్ గౌడ్



**నార్కట్ పల్లి, మార్చి 13 ( ప్రజా జ్యోతి):**

పట్టణ కేంద్రంలోని కామినేని హాస్పిటల్ రోడ్డు సుంషిన్ కాలనీ ఎదురుగా నూతనంగా గోదావరి కిచెన్, కేఫ్ హోటల్ ను మేజర్ గ్రామపంచాయతీ సర్పంచుల ఫోరం మరియు మండలఅధ్యక్షులు జేరిపోతుల భరత్ గౌడ్ , మండలపార్టీ మాజీ అధ్యక్షులు సట్టు సత్తయ్య,ఎంపీటీసీలా ఫోరం జిల్లా మాజీ అధ్యక్షులుపాశం శ్రీనివాస్ రెడ్డి ,మాజీ నార్కట్ పల్లి సర్పంచ్ పుల్లెంల అచ్చాలు,నార్కట్ పల్లి ఉపసర్పంచ్ శిరీషా ప్రవీణ్ రెడ్డి ,నార్కట్ పల్లి మేజర్ గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు వడ్డెగోని రామలింగం , ఆమనగశీటీ ఐలయ్య , జిల్లా మహేష్ కుమార్ ,భాషీర్, సీనియర్ నాయకులు మట్టపల్లినాగరాజు , మాదాసు నరసింహ యూత్ కాంగ్రెస్ నాయకులు ఐతరాజు వెంకటేష్ , మాదాసు విజయ్,పుల్లెంల మహేష్ , హోటల్ ఇంచార్జి నిరంజన, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్ల పంపిణీ

## విద్యార్థులు గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తేవాలి. సర్పంచి వీరేశం

**సంస్థాన్ నారాయణపురం,**

మార్చి 13, (ప్రజాజ్యోతి) : విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తేవాలని కంకణాల గూడెం గ్రామ సర్పంచ్ పాలెం వీరేశ్ గౌడ్ కోరారు. సంస్థాన్ నారాయణపురం మండలం కంకణాల గూడెం గ్రామం పంచాయతీ పరిధిలో ఉన్న పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం పరీక్ష ప్యాడ్లు పెన్నులు ఇతర సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు బాగా రాణించాలని కోరారు. ఈ సందర్భంగా దాతలు వీరబ్రహ్మం, శోభన్ బాబు, శ్రీను, కిరణ్ గుప్తా లను సర్పంచ్ వీరేష్ గౌడ్ అభినందించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గిరిబాబు, సిరిపంగి రమేష్, రాజేందర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# నిరుద్యోగ సమస్యలపై నిరుద్యోగ మార్చ్‌కు పిలుపు:

## -ఎంజి యూనివర్సిటీ బి ఆర్ ఎస్ వి అధ్యక్షుడు వాడపల్లి నవీన్ అరెస్టు

నార్కట్ పల్లి, మార్చి 13 ( ప్రజా జ్యోతి): నిరుద్యోగ సమస్యలపై నిరుద్యోగ మార్చ్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో నల్గొండ మహాత్మా గాంధీ యూనివర్సిటీకి చెందిన వి బి ఆర్ ఎస్ వి అధ్యక్షుడు వాడపల్లి నవీన్‌ను శుక్రవారం ఉదయం పోలీసులు అరెస్టు చేశారు. తెల్లవారుజామున ఆయన నివాసం వద్దకు చేరుకున్న నార్కట్‌పల్లి పోలీసులు నవీన్‌ను అదుపులోకి తీసుకుని నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దిల్సుఖ్‌నగర్‌లో నిరుద్యోగుల సమస్యలపై భారీ ప్రదర్శన నిర్వహించేందుకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ అరెస్టు జరిగినట్లు తెలిసింది. అనంతరం నవీన్ పత్రిక విలేకరులతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, అసెంబ్లీలో రెండు లక్షల ఉద్యోగాలను ప్రకటించాలని నవీన్ డిమాండ్ చేశారు.




నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, అసెంబ్లీలో రెండు లక్షల ఉద్యోగాలను ప్రకటించాలని నవీన్ డిమాండ్ చేశారు.నిరుద్యోగుల సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విద్యార్థి, నిరుద్యోగ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

# గ్రామ అభివృద్ధిలో వార్డు సభ్యులే కీలకం: జడ్పీ సీఈఓ శోభారాణి

చౌటుప్పల్, మార్చి 13 (ప్రజా జ్యోతి):
గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధిలో వార్డు సభ్యులే వెన్నెముక వంటి వారని యాదాద్రి భువనగిరి జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో వార్డు సభ్యుల కోసం ఏర్పాటు చేసిన రెండవ విడత శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై, శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన సభ్యులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీఈఓ శోభారాణి మాట్లాడుతూ.. వార్డు సభ్యులు తమ పరిధిలోని ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించాలని సూచించారు. ముఖ్యంగా మౌలిక వసతులు తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల ఏర్పాటులో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. నూతన పంచాయతీ రాజ్ చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకుని, తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో ప్రజలను భాగస్వాములను చేస్తూ గ్రామ రూపురేఖలను మార్చాలని పిలుపునిచ్చారు. శిక్షణ అందించిన టీఓటీలు ఆకుల శ్రీకాంత్, శివశంకర్, వెంకటేష్, వినయ్‌లను ఈ సందర్భంగా ఆమె అభినందించారు. ?ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బొజ్జ సందీప్ కుమార్, సూపరింటెండెంట్ విజయ్ కుమార్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.




# గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లకు కొరత లేదు

## వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట జిల్లా ప్రతినిధి మార్చి 13(ప్రజాజ్యోతి):సూర్యాపేట జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు.శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీలు,పౌరసరఫరాల అధికారులతో ఎల్పిజి గ్యాస్ సరఫరాపై సమావేశం నిర్వహించారు.గృహ అవసరాలకు వినియోగించే ఎల్పిజి గ్యాస్ సరఫరా లో ఏలాంటి కొరత లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.సూర్యాపేట జిల్లాల్ 415509 డొమెస్టిక్ కనెక్షన్లు ఉన్నాయని,ప్రస్తుతం జిల్లాలో 17647 డొమెస్టిక్ సిలిండర్లు, 552 కమర్షియల్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.గ్యాస్ బుక్ చేసుకున్న రెండు మూడు రోజుల్లోనే వినియోగదారులకు సకాలంలో డెలివరీ చేయడం జరుగుతుందని వివరించారు. కమర్షియల్ సరఫరాలో ఏర్పడిన కొరతను అధిగమించేందుకు ఉపశమనం వైపు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ ను ఎవరైనా కమర్షియల్ గా వాడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గృహ అవసరాలకు వినియోగించే ఎల్పిజి గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరత లేనందున ప్రజలు ఆందోళనకు గురై అనవసరంగా గ్యాస్ బుక్ చేసుకోవద్దని కోరారు.

## ఆకట్టుకున్న స్వపరిపాల దినోత్సవ వేడుకలు.



**నడిగూడెం ,మార్చి 13, ప్రజా జ్యోతి:**

నడిగూడెం మండలం రామాపురం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారుల వేషధారణలో పాఠాలు బోధిస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, సర్పంచ్ వెంకట రెడ్డి పాల్గొని విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు పిల్లల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని ప్రధానోపాధ్యాయులు గోపయ్య, ఏడుకొండలు తెలిపారు.

## పాలేరు వాగులో పడి వ్యక్తి మృతి



**మిర్యాలగూడ, మార్చి 13,( ప్రజాజ్యోతి ):**

పాలేరు వాగులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మిర్యాలగూడ మండలం తడకమళ్ళ శివారులో శుక్రవారం వెలుగు చూసింది. రూరల్ ఎస్సై ఎం లక్ష్మయ్య మాట్లాడుతూ తడకమళ్ళ గ్రామానికి చెందిన అనంతుల లింగయ్య రోజు మాదిరిగానే గురువారం పాలేరు వాగు అవతల వైపు ఉన్న తన పొలానికి వెళు న్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్ళాడు.కానీ ఆరోజు ఇంటికి రాకపోయేసరికి తెల్లారి శుక్రవారం అతని కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం వెతుకుతుండగా పాలేరు వాగులో అతని మృతదేహం లభ్యమైంది. అతని మృతికి కారణాలు తెలియనప్పటికీ కుమారుడు అనంతుల సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పెన్నులు పరీక్ష సామాగ్రి అందజేత

ఆలేరు మార్చి 13 ప్రజా జ్యోతి

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సారాజుపేటలో 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థిని ఎమ్మా భారతీయ రాజా పరీక్ష ప్యాడ్స్ పెన్నులు పరీక్ష సామాగ్రిని శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతిరాజు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరరావు, సంజీవరెడ్డి ,కాంతారావు ,గడసంతల మధుసూదన్ ,దయాకర్, శ్రీనివాస్, దివాకర్, ఏలేంద్ర తదితరులు పాల్గొన్నారు.




# రాజాపేట లో నల్లంతిగల్ చేతుల మీదుగా నూతన పరాభవ నామ సంవత్సర పంచాంగ ఆవిష్కరణ.......




రాజాపేట, మార్చి 13 (ప్రజా జ్యోతి ) యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ పూర్వ ప్రధాన అర్చకులు నల్లన్ తీగల్ లక్ష్మీనరసింహాచార్యులు విజయలక్ష్మి దంపతులు శుక్రవారం రాజపేటలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరం ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలోని సకల దేవత మూర్తులకు మాజీ ప్రధానార్చకులు ప్రత్యేకంగా పూజలు చేసి స్వామివారిని కొలిచారు. పాల్గొన్న భక్త జనులందరికీ గోత్రనామార్చనలతో ఆశీర్వచనం చేశారు. భక్తులనుదేశించి అభిభాషణ చేశారు. పూజలు చేస్తే భక్తితో దేవతలను కొలిస్తే కలిగే ప్రయోజనాలను వివరించారు. పరాభవ నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. పరాభవ నామ సంవత్సరంలో అనుమానాలు లేకుండా సన్మానాలతో ప్రతి ఒక్కరు కొనసాగాలని, కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. శ్రీ రామకృష్ణ సాయి మందిరం ఆలయ ట్రస్ట్ శాశ్వత గౌరవ అధ్యక్షులు నంగునూరు చంద్రశేఖర్, సభ్యులు అభివృద్ధి సేవ కమిటీ చేస్తున్న సేవ ఆధ్యాత్మిక కార్యక్రమాలను కొనియాడారు. భక్తి విత్తు ను నాటిన శ్రీ రామకృష్ణ సాయి మందిరం నిర్వాహకులు విశ్వ వటవృక్షంగా మారిందని, ఎన్నో దేవాలయాలకు స్ఫూర్తిదాయకంగా మార్గదర్శకంగా నిలిచిందని అభినందించారు. సంవత్సర కాలం పాటు ఆలయంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేసి ప్రశంసించారు. అంతకుముందు నల్లన్ తీగల్ లక్ష్మీనరసింహచార్యులు విజయలక్ష్మి దంపతులను అభయాంజనేయ స్వామి వారి దేవాలయం వద్ద దాచేపల్లి శ్రీనివాస్ స్వరూప దంపతులు మంగళహారతులతో స్వాగతం పలికారు. ప్రధాన వీధులలో మేళతాళాలతో పూలు చల్లుతూ మంగళహారతులతో బాణాసంచా కాలుస్తూ స్వాగతం పలికి తమ భక్తిని చాటుకున్నారు. శ్రీ రామకృష్ణ సాయి మందిరం ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద శర్మ పూర్ణకుంభ స్వాగతం పలికి ఆలయంలోకి ఆహ్వానించారు. పాల్గొన్న భక్తులు పాదపూజ చేశారు. ఆశీర్వాదం పొందారు. భక్తులకు స్వయంగా తీర్థప్రసాదాలు అందజేసిన నల్లన్ తీగళ్ లక్ష్మీనరసింహచార్యులు కార్యక్రమాన్ని నిర్వహణ పట్ల ఆలయ నిర్వహణ పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పంచాంగ ముద్రణ దాతలను సత్కరించారు. ఆలయంలో రామాయణ మహాభారత భాగవత ఉపదేశాలను నిర్వహించేందుకు కాను పూర్తిగా కృషి చేయనున్నట్లు చెప్పగా పాల్గొన్న భక్తులందరూ చప్పట్లతో సంతోషం వ్యక్తం చేసి స్వాగతించారు. ఇలాంటి అద్భుత కార్యక్రమాలు నిర్వహించిన ఆలయ నిర్వాహకులకు ట్రస్టు అభివృద్ధి సేవా కమిటీ సభ్యులకు పాల్గొన్న భక్తులు కృతజ్ఞతలు చెప్పారు.

# పోచంపల్లిలో కార్పొరేట్ విద్యకు కొత్త దిశ “లీడేలు ఇంటర్నేషనల్ స్కూల్”

### ఘనంగా లీడేలు ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవం

### విద్యార్థుల ప్రతిభతో అలరించిన లీడేలు




**భూదాన్ పోచంపల్లి, మార్చ్ 13 (ప్రజాజ్యోతి)**

గ్రామీణ ప్రాంతాల్లో కూడా కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనే లక్ష్యంగా కర్నాటి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లీడేలు ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవం భూదాన్ పోచంపల్లిలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన అతిథులు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాఠశాల నిర్వహణపై ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, సాధారణంగా హైదరాబాద్ నగరానికే పరిమితమై ఉన్న కార్పొరేట్ విద్యను పోచంపల్లి వంటి గ్రామీణ ప్రాంతానికి తీసుకువచ్చి నాణ్యమైన విద్యను అందించడం స్థానిక ప్రజలకు గర్వకారణమని పేర్కొన్నారు. కర్నాటి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో లీడేలు ఇంటర్నేషనల్ స్కూల్‌ను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు ఆధునిక విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పిస్తున్న స్కూల్ చైర్మన్ కర్ణాటక శ్రవణ్ కుమార్ సేవలను వారు అభినందించారు. మొదట ఈ పాఠశాల వార్షికోత్సవానికి వచ్చినప్పుడు ఇది చిన్న పాఠశాలగా భావించామని, అయితే పాఠశాల ప్రాంగణంలో ఉన్న విశాలమైన మరియు ప్రశాంతమైన వాతావరణం, విశాలమైన ప్లే గ్రౌండ్, ఆధునిక తరగతి గదులు, విద్యార్థుల అభివృద్ధికి అనువైన అనేక సౌకర్యాలు ఏర్పాటు చేయడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాల జ్ఞానంతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. విద్య ద్వారానే విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుని ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోగలరని సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. చిన్నారుల నృత్యాలు, పాటలు, నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభను చూసి తల్లిదండ్రులు, అతిథులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, ప్రముఖ వ్యాఖ్యాత సంద్ర సుధీర్, స్కూల్ అడ్వైజర్ రాధా, పట్టణ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవ కుమార్, మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, ప్రముఖ వ్యాపారవేత్త సీత హరిప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ కాశీనాథ్, మేనేజర్ మురళి, పర్యవేక్షకులు మహమ్మద్ ఆజం, ఎర్ర జగన్, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి ..ఎంఈఓ సైదా నాయక్

చిట్యాల మార్చ్ 13(ప్రజా జ్యోతి ప్రతినిధి): చిట్యాల పట్టణంలో 10వ తరగతి పరీక్షలకు పూర్తి ఏర్పాట్లు చేశామని ఎంఈఓ సైదా నాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ



10వ తరగతి పరీక్షలు మండలంలో మొత్తము 417 మంది విద్యార్థులు రాయనున్నారు దీనిలో238 మంది బాలురు 179 మంది బాలికలు ఉన్నారు ఇందుకోసం మూడు సెంటర్లను ఏర్పాటు చేశాము. చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 130 మంది,గ్రీన్ గ్రో పాఠశాలలో 137 మంది, న్యూ లిటిల్ ఫ్లవర్స్ స్కూల్లో 150 మంది పరీక్షలకు రాయనన్నట్టు తెలిపారు. మండలంలో తొమ్మిది ప్రభుత్వ పాఠశాలల నుంచి 221 ఆరు ప్రైవేట్ పాఠశాల నుండి 196 మంది విద్యార్థులు పరీక్షకు సిద్ధమయ్యారని తెలిపారు.

# కార్మిక వర్గానికి ముప్పుగా 4 లేబర్ కోడ్‌లు

**– పీవైఎల్ జిల్లా కోశాధికారి పగడాల శివ**

**లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ధర్నాలకు పిలుపు**

**భూదాన్ పోచంపల్లి, మార్చ్ 13 (ప్రజాజ్యోతి)**

కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి అమలు చేయనున్న నాలుగు లేబర్ కోడ్‌లు కార్మిక వర్గానికి ఉరితాళ్లుగా మారనున్నాయని పీవైఎల్ జిల్లా కోశాధికారి పగడాల శివ విమర్శించారు. శుక్రవారం పోచంపల్లి కేజీబీవీలో తెలంగాణ ప్రగతిశీల నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ (ఐఎఫ్‌టియు) ఆధ్వర్యంలో మార్చి 16న జిల్లా కలెక్టరేట్ ముందు, మార్చి 23న హైదరాబాద్ లేబర్ కమిషనరేట్ ముందు జరిగే ధర్నాలకు సంబంధించిన పోస్టర్లను



ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాపాడేందుకు ఈ లేబర్ కోడ్‌లను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డి. లక్ష్మి, ఎస్. లావణ్య, జి. హైమావతి రాజేశ్వరి, ఏ. లక్ష్మమ్మ, జి. గిరిజ, నాగమణి, శోభ, పోతగల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో తాగు, సాగునీటి కొరత లేకుండా చూడాలి

**జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

**హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్, వ్యవసాయ, పౌరసరఫరాల అధికారులతో సాగు, తాగునీరు, ఎల్పిజి గ్యాస్ సరఫరా తదితర విషయాల పై వీడియో కాన్ఫరెన్స్**

**ఆయా ప్రాజెక్టుల కింద ఎక్కడైనా భూ సేకరణకు సంబంధించి సమస్య ఉంటే పరిష్కరించాలి, పేమెంట్ లకు సంబంధించిన వివరాలను సైతం సమర్పించాలి**

**నల్గొండ మార్చి 13(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

వేసవిలో తాగు, సాగునీటి కొరత లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్, వ్యవసాయ, పౌరసరఫరాల అధికారులతో సాగు, తాగునీరు, ఎల్పిజి గ్యాస్ సరఫరా తదితర విషయాల పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మిర్యాలగూడలో నిర్వహించిన ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్ మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో ఇదే విషయమై సమీక్ష నిర్వహించారు.



ఈ సందర్భంగా ఆయన నల్గొండ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి రిజర్వాయర్లు, తదితర వివరాలన్నింటిని ఇంజనీరింగ్ అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత మాట్లాడుతూ వేసవిలో తాగునీటికీ అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ముఖ్యంగా గత సంవత్సరం అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జూన్ చివరి వరకు ప్రజలకు ఆయా రిజర్వాయర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు అవసరమైనంత నీటిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ముఖ్యంగా ఉదయ సముద్రం ద్వారా నల్గొండ పట్టణానికి, చుట్టుపక్కల గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసేందుకు అవసరమయ్యే నీటిని నిలువ ఉంచాలని చెప్పారు. ఇదే సమయంలో ఉదయ సముద్రం కింద సాగవుతున్న పంటల పరిస్థితిలను ఎప్పటి వరకు సాగునీరు అవసరం ఉందో క్షేత్రస్థాయిలో ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసి నివేదిక సమర్పించాలన్నారు. సాధ్యమైనంత త్వరగా రైతులు ప్రస్తుత పంటలను కోసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఎట్టి పరిస్థితులలో తాగునీటికి సమస్య ఏర్పడకుండా చూడాలని, ఆ విధంగా ప్రణాళిక రూపొందించాలని, సాగర్, ఇతర ప్రాజెక్టుల ద్వారా వచ్చే సాగునీరు, తాగునీటి రిజర్వాయర్లను ఎప్పటికప్పుడు సమీక్షించి తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అలాగే మిర్యాలగూడ పట్టణానికి తాగునీరిచ్చే నాగార్జునసాగర్ ప్రాజెక్టు టేలెండ్ ను సందర్శించి ఇరిగేషన్, తాగునీటి అధికారులతో సందర్శించి నివేదిక ఇవ్వాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ తో కోరారు. ఆయా ప్రాజెక్టుల కింద ఎక్కడైనా భూ సేకరణకు సంబంధించి సమస్య ఉంటే పరిష్కరించాలని, అలాగే పేమెంట్ లకు సంబంధించిన వివరాలను సైతం సమర్పించాలని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టుల కింద భూసేకరణకు గుర్తించిన భూములకు సంబంధించి వెంటనే సరిహద్దులను ఏర్పాటు చేయాలని, పెగ్ మార్కింగ్ లేదా కందకాలు తవ్వడం వంటివి చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అంతకుముందు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎల్పీజీ గ్యాస్ సరఫరా ప్రస్తుత పంటపొలాలకు సాగు నీరు, రబీ సీజన్లో చేపట్టే ధాన్యం సేకరణ పై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్లు అధికారులు ఎక్కడ సాగునీరు, విద్యుత్ కొరత కారణంగా పంటలు ఎండిపోకుండా చూడాలని, ఈనెలాఖరు వరకు అత్యంతప్రమత్తంగా ఉండి పంటలను కాపాడాలని, ప్రతి రెండు, మూడు రోజులకు ఒకసారి ఆయా ప్రాజెక్టుల కింద ఇంజనీర్లు, వ్యవసాయ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని పరిస్థితులను సమీక్షించాలని చెప్పారు. ఇరిగేషన్ అధికారులు లస్కర్ల తో మొదలుకొని అందరు అందుబాటులో ఉండాలని, విషయాన్ని సీరియస్ గా తీసుకోవాలని, వ్యవసాయం, నీటిపారుదల, విద్యుత్ పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. సాగునీరు లేని కారణంగా ఎక్కడ పంటలు ఎండిపోయాయన్న అపవాదు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన తేల్చి చెప్పారు. ఎల్. పి. జి గ్యాస్ సరఫరా విషయంలో ఎటువంటి గందరగోళానికి గురి కావొద్దని, గృహ వినియోగదారులకు సరిపడా సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు. సోషల్ మీడియా వేదిక ద్వారా జరుగుతున్న తప్పుడు ప్రచారంతో కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించేందుకు జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రస్థాయిలో తిప్పి కొట్టారు. ఇటువంటి గందరగోళం ఏర్పడినందునే రోజు వారిగా 72% బుకింగ్స్ జరుగుతున్నాయని, అయితే గృహ వినియోగదారులతో పాటు, ఆసుపత్రిలకు, విద్యాసంస్థలకు, వృద్ధాశ్రమలకు, ప్రభుత్వ సంస్థలకు ప్రాధన్యత క్రమంలో సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో 810 ఎల్. పి. జి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందన్నారు. అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ చేయాలని చూస్తే ప్రభుత్వం ఎంత మాత్రం ఉపేక్షించదని, కఠినమైన చర్యలకు ఉపక్రమిస్తుందని ఆయన హెచ్చరించారు. తాజాగా జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా గ్యాస్ నిలువ చేయడం, అక్రమంగా మళ్లించడం, బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడనందుకు గాను ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేశామన్నారు. ఎల్.పి. జి డిస్ట్రిబ్యూటర్లు ఇదే విదంగా ప్రవర్తిస్తే మరిన్నీ కఠిన చర్యలకు ఉపక్రమించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు, ఎస్.పి లు, పోలీస్ కమీషనర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. ఆయా జిల్లాల్లో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక అధికారుల కమిటీ ఏర్పాటు చేసి రోజువారీ నిల్వలు,సరఫరా పరిస్థితిని సమీక్షించాలని ఆయన సూచించారు. పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల కొకసారి, గ్రామీణ 45 రోజులకు ఒకమారు ఎల్.పి.జి బుక్ చేసుకోవాలని ఆయన గ్యాస్ వినియోగదారులకు సూచించారు. అదే సమయంలో అపోహలను నమ్మి అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకోవొద్దని, గృహా వినియోగ దారులకు సరిపడా గ్యాస సరఫరా చేస్తామని, ప్రభుత్వం దగ్గర ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ తోటల సాగు పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆయా జిల్లాలకు ఇచ్చిన లక్ష్యాలను సాధించాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి ఈఅంశంపై సమీక్షించి నిర్దేశించిన లక్ష్యాలు సాధించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ, పౌరసరఫరాలు తదితర శాఖల అధికారులు ఉన్నారు.



# పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

**ఆలేరు మార్చి 13 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో శనివారం నుండి జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు మండల కేంద్రంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి ఎర్ర లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు, జయం జె హై స్కూల్, రామకృష్ణ హై స్కూల్లో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు ఆలేరు పరిష కేంద్రంలో సిఎస్ గా దాసరి మంజుల, డీఓ గా పాల్వాయి వెంకటయ్య, జయం జె పరీక్ష కేంద్రానికి సిఎస్ భగవాన్, డిఓ గా రమాదేవి, రామకృష్ణ పరీక్ష కేంద్రానికి సిఎస్ గా ఆకుల వేణుగోపాల్, డివో గా శ్రీనివాస్, వ్యవహరిస్తున్నారని చెప్పారు. మూడు పరీక్ష కేంద్రాలలో మొత్తం 625 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.

# ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

**రామన్నపేట, మార్చి 13 (ప్రజా జ్యోతి)**



ఈనెల 15వ తేదీ నుండి 19వ తేదీ వరకు వెల్లంకి గ్రామంలో జరిగే శ్రీ శంభు లింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను శుక్రవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వనం సత్తయ్య,మాజీ ఎంపీటీసీలు తిమ్మాపురం మహేందర్ రెడ్డి,బర్ల బాబురావు,ఈడెం స్వరూప స్మారక ట్రస్ట్ చైర్మన్ ఈడెం శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి కనుతాల శశిధర్ రెడ్డి,కమిటీ సభ్యులు కర్రె సంతోష్ ,దేవరకొండ ఉపేంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు భయాందోళనకు గురికావద్దు

**బిజెపి రాష్ట్ర నాయకులు, విద్యావేత్త సిహెచ్ శ్రీనివాస్**

రామన్నపేట, మార్చి 13,( ప్రజా జ్యోతి)

పదవ తరగతి విద్యార్థులు నేటి నుంచి జరగబోయే పరీక్షలను ప్రశాంతమైన వాతావరణంలో, ఎటువంటి భయాందోళనలు లేకుండా రాసి,మంచి ఫలితాలు సాధించాలని బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు, విద్యావేత్త చిన్నపాక శ్రీనివాస్ సూచించారు.రాత్రిపూట మంచి నిద్ర, సమయానికి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఒత్తిడి తగ్గుతుందని చదువుకునేటప్పుడు మొబైల్ ఫోన్లు, టీవీ, ఇతర ఆటంకాలకు దూరంగా ఉండాలని తెలిపారు.



# నిజాయితీ చాటుకున్న వ్యాపారి అసిఫ్

## ఏ టీ ఎం వద్ద దొరికిన డబ్బులు బ్యాంక్ లో అప్పగింత

**మిర్యాలగూడ, మార్చి 13,( ప్రజాజ్యోతి ):**



ఏటీఎం మిషన్ వద్ద దొరికిన నగదును తిరిగి బ్యాంక్ సిబ్బందికి అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఎండి ఆసిఫ్ అనే వ్యాపారి. పట్టణంలోని బంగారుగడ్డ ఈద్గా ఎదురుగా ఉన్న ఎస్ బి ఐ ఏటీఎంలో నగదు డ్రా చేసుకునేందుకు వెళ్లిన ఆసిఫ్ కు మిషన్ అవుట్ లెట్ లో పదివేల రూపాయల నగదు ఉండటం గమనించాడు. వెంటనే పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన శాఖ డిప్యూటీ మేనేజర్ జి.నరేందర్ కు జరిగిన విషయం తెలిపి నగదు అందజేశారు. గురువారం రాత్రి ఏటీఎం నుండి డబ్బు రాలేదని ఒక ఖాతాదారుడు శుక్రవారం తమకు ఫిర్యాదు చేశాడని బ్యాంక్ అధికారులు పేర్కొన్నారు. బహుశా నగదు అతనిదే కావచ్చు అని విచారించి అతను రాగానే డబ్బు అప్పగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆసిఫ్ నిజాయితీని బ్యాంక్ అధికారులతో పాటు ఖాతాదారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు కాజా హామీదుద్దీన్, ఎండి అస్లాం, ఆరిఫ్ లు ఉన్నారు.

# నాంపల్లి లో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక...పరిశుభ్రత పనులు



నాంపల్లి,మార్చి,13(ప్రజా జ్యోతి):ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వ నిర్దేశించిన పారిశుద్ధ్య పనులను గ్రామ సర్పంచ్ నక్క చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పనులను చేపట్టారు. తొట్లలో, గిన్నలలో నీటిని నిలువ చేయరాదని, నీటి నిలువలను దోమలు అధికమై ప్రజలు అనారోగ్య ద్వారానే పడతారని నీటిని తొలగించారు. నాగులమ్మ చెరువులో గత కొంత కాలంగా ఉన్న చెత్తను శుభ్రం చేయించారు. అలాగే అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీను, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్స్, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఉపాధ్యాయులుగా.. అలరించిన విద్యార్థులు

## శ్రీ సరస్వతీ శిశు మందిర్ లో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**మిర్యాలగూడ, మార్చి 13,( ప్రజాజ్యోతి ):**

మిర్యాలగూడ లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ లో శుక్రవారం ఘనంగా స్వపరిపాలన దినోత్సవ వేడుకలనునిర్వహించారు. పాఠశాల చిన్నారులు వివిధ వేషధారణలో చక్కగా రాణించారు. ముఖ్యమంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా, కలెక్టర్ గా, జిల్లా విద్యాశాఖ అధికారిగా, ఎంఈఓ తో పాటు ఉపాధ్యాయులుగా చిన్నారులు చక్కగా తమ పాత్రలను పోషించి కోలాహలంగా సెల్ఫ్ డే ను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ మాట్లాడుతూ విలువలతో కూడిన నైతిక విద్య వికాస అభివృద్ధి కోసం శ్రీ సరస్వతి విద్యా నిలయాలు పనిచేస్తున్నాయన్నారు. విద్యతోపాటుగా సమాజ పోషణ, కుటుంబాలతో సంపర్కాలు,మారుతున్న కాల పరిస్థితులకు అనుగుణంగా విద్యా వికాసానికి తమ పాఠశాల పునాది వేస్తుందన్నారు. ఆంగ్ల భాష నైపుణ్య వికాసం కోసం ప్రత్యేక శిక్షణను ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం వివిధ వేషధారణలో అలరించిన చిన్నారులకు బహుమతులను అందించారు.ముఖ్యమంత్రిగా తల్లం అకుల్, విద్యాశాఖ మంత్రిగా రిషిక, కలెక్టర్ గా తల్లం మహదేవ్, డీఈఓ గా శివమాన్ సింగ్, ఎంఈఓ గా హాసినిలు చక్కగా రాణించారు . వారికి బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో మాతాజీలు నాగమణి, స్వాతి, మానస, శ్రావణి, జయ, నాగలక్ష్మి, సత్యవతి, పార్వతి, పాఠశాల కార్యాలయ ప్రముఖ్ రాములు తదితరులు పాల్గొన్నారు.



# పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**మండల విద్యాధికారి రాములు నాయక్..**



**నూతనకల్. మార్చి 13 (ప్రజా జ్యోతి):**

నేటి నుండి నిర్వహించే పదవ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని మండల విద్యాధికారి రాములు నాయక్ పరీక్ష నిర్వహణ అధికారులను కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని జడ్.పి.హెచ్.ఎస్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్ష నిర్వహణాధికారులకు, ఇన్విజిలేటర్స్ కు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ పరీక్షలు పకడ్బందీగా,సజావుగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. జడ్.పి.హెచ్.ఎస్ సెంటర్ లో 212 మంది విద్యార్థులు, విజయ్ మేరీ సెంటర్ లో 200 మంది విద్యార్థులు, మొత్తంగా 412 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్స్ కట్ట కృష్ణయ్య, బాల్లు శ్రీనివాస్ లు, డిపార్ట్మెంట్ అధికారులు మోతె శ్రీనివాస్, అశోక్ లు, ఇన్విజిలేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

# పది' పరీక్షలకు సర్వం సిద్ధం: ఎంఈఓ లావూరి వెంకన్న నాయక్



నిడమనూరు, మార్చి 13(ప్రజాజ్యోతి): ప్రస్తుత విద్యాసంవత్సరంలో మార్చి 14 నుండి నిర్వహించనున్న పదవతరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయినట్లు నిడమనూరు ఎంఈఓ లావూరి వెంకన్న నాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు, ఆదర్శ పాఠశాల,ముకుందాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసే పరీక్షా కేంద్రాలలో ఈ నెల 14 నుండి ఏప్రిల్ 16 వరకు ఉదయం 9 :30గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించే ఈ పరీక్షలకు 200మంది బాలురు, 226 మంది బాలికలు మొత్తం 426 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు, ఆదర్శ పాఠశాల ,కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, మైనార్టీ పాఠశాల,బిసి గురుకుల పాఠశాల తిరుమలగిరి (సాగర్),ప్రైవేటు పాఠశాలలో పాటు మండలంలో ముకుందాపురం జెడ్పిహెచ్ఎస్ ,శాంతినికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు మూడు పరీక్షా కేంద్రాలలో పరీక్షలు రాస్తున్నందున విద్యార్థులు ఉదయం 8:30 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాలలో కనీస మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థులు ఇష్టంగా చదివి పరీక్షలు రాయడానికి ప్రతి పరీక్షకు మూడు లేదా నాలుగు రోజుల వ్యవధి ఉంటున్నందున జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు ఆ రోజులలో మధ్యాహ్నం భోజనంతో పాటు విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం సబ్జెక్టు వారీగా ఉపాధ్యాయులు పాఠశాలలోనే కూర్చోబెట్టుకొని రివిజన్ చేయించాలన్నారు. నిడమనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 160 విద్యార్థులు, ఆదర్శ పాఠశాలలో 194మంది విద్యార్థులు,ముకుందాపురం జెడ్పిహెచ్ఎస్ పాఠశాల లో 72మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు ముగ్గురు చీఫ్ సూపరిటెంట్, నలుగురు డిపార్ట్మెంట్ ,1సిట్టింగ్ స్క్వాడ్, ఎంఈవో అధికారులతో పాటు 24 మంది ఇన్విజిలేటర్లకు విధులు కేటాయించినట్లు తెలిపారు. భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం పరీక్షలు ఉదయం 9:30 గంటలకు ప్రారంభమై 11 గంటలకు ముగుస్తాయన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రతి పరీక్షా కేంద్రానికి ఏఎన్ఎంను నియమించడంతోపాటు ప్రతి పాఠశాలకు ప్రభుత్వం ఇప్పటికే హాల్ టికెట్స్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. హాల్ టికెట్లను వెబ్సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకొని పరీక్షలకు హాజరు కావచ్చన్నారు. విద్యార్థుల ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ఇష్టంగా చదివిన సబ్జెక్టులను పునఃశ్చరణ చేసుకొని ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలన్నారు.

# తాహసిల్దారుగా చందర్ రావు బాధ్యతలు స్వీకరణ



**హాలియా,మార్చి13(ప్రజా జ్యోతి)**

అనుముల మండల నూతన తాహసిల్దారుగా బి.చందర్ రావు నియమితులయ్యారు. శుక్రవారం కార్యాలయంలో ప్రస్తుత తహసిల్దార్ రఘు నుండి పదవీ బాధ్యతలను స్వీకరించారు. చందర్ రావు హైదరాబాద్ మూసీ రివర్ ప్రాజెక్టులో పనిచేస్తూ అనుముల మండలానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం పని చేస్తున్న నాయబ్ తహసిల్దార్ రఘు బాధ్యతలు అప్పగించారు. అనంతరం నూతన తహసిల్దార్ కు రెవిన్యూ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

## లిల్లీ ప్రవీణా డిజైనింగ్ అండ్ లేడీస్ టైలర్స్ ప్రారంభం

సూర్యాపేట జిల్లా ప్రతినిధి మార్చి 13(ప్రజాజ్యోతి): వినియోగదారుల మన్ననలు పొందినప్పుడే ఏ వ్యాపారమైన అభివృద్ధి చెందుతుందని ప్రముఖ వ్యాపారవేత్త మొరిశెట్టి ఉపేందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రామలింగేశ్వర థియేటర్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన లిల్లీ ప్రవీణా డిజైనింగ్ అండ్ లేడీస్ టైలర్స్ ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వినియోగదారులకు ఉత్తమ సేవలను అందించి ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం లిల్లీ ప్రవీణా డిజైనింగ్ అండ్ లేడీస్ టైలర్స్ నిర్వాహకురాలు చిలుముల ప్రవీణారెడ్డి మాట్లాడుతూ మహిళల కొరకు లేటెస్ట్ డిజైన్లతో అన్ని రకాల డ్రెస్సుల టైలరింగ్,కంప్యూటర్ అండ్ మగ్గం వర్క్ తమ ప్రత్యేకత అని తెలిపారు. మహిళలు తాము అందించే సేవలను వినియోగించుకొని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిలుముల నిరంజన్ రెడ్డి,ట్రాక్టర్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షులు రాందేని ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



# ఆత్మీయత మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

**- సర్పంచ్ వేమూరి సతీష్ కుమార్.**



**చిలుకూరు మార్చి13:( ప్రజా జ్యోతి )**

పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల్లో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత మత సామరస్యానికి ప్రతికని చిలుకూరు మండలం రామాపురం సర్పంచ్ వేమూరి సతీష్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా రామాపురం గ్రామంలో ముస్లిం సోదరులు ,సోదరిమణులకు సతీష్ కుమార్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వారు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ముస్లిం సోదరులు రంజాన్ మాసం అంతా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే ముస్లిం సోదరులకు ఇచ్చే ఇఫార్ విందు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. రంజాన్ పండుగ వారి జీవితాలలో సుఖసంతోషాలను నింపాలని ఆ అల్లాహ్ ను కోరుకుంటున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు సభ్యులు గన్నా కోటేశ్వర వర్మ,ముస్లిం సోదరులు షేక్ అబ్దుల్ నబీ, షేక్ మస్తాన్,పాషామియా,అజీజ్ మియా,గౌస్మియా,రంజాన్ అలీ, షేక్ మీరా (బిఆర్ఎస్),జానిమియ ,నజీర్, ప్రభుత్వ ఉద్యోగులు షేక్ మస్తాన్, జబ్బార్,రఫీ,సాదె నాగేశ్వరరావు,దూదిపాళ్ళ వెంకటేష్ మైనారిటీ సోదరుల పాల్గొన్నారు,

# అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు ఆర్థిక సహాయం

**హుజూర్ నగర్, మార్చి 13 (ప్రజా జ్యోతి):**

పట్టణంలోని 25వ వార్డుకు చెందిన మహిళకు హుజూర్ నగర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోతి సంపత్ రెడ్డి ఆర్థిక సహాయం అందించారు. శుక్రవారం పట్టణంలోని సీతారాం నగర్ 25వ వార్డుకు చెందిన బుడిగ సావిత్రమ్మ గత 20 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న స్థానిక 25 వ వార్డు కౌన్సిలర్ కోతి సంపత్ రెడ్డి హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం 5000 రూపాయల ఆర్థిక సాయం అందించారు. వార్డులో ఏ సమస్య వచ్చినా పేదలకు అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో మూడో వార్డు కౌన్సిలర్ సులువ నాగలక్ష్మి చంద్రశేఖర్, 25వ వార్డు బూత్ కమిటీ సభ్యులు యాల్లావుల వీరయ్య, ఓర్స్ వెంకన్న, తోట ఉపేందర్, పిల్లి.శివ శంకర్, ములకలపల్లి శ్రీను, శీలం సైదులు, కొత్తపల్లి శ్రీను, గుంజ గౌతమ్, గణపవరపు సైదులు, వెన్నం.నరసింహారావు, మాదాసు శశి తదితరులు పాల్గొన్నారు.

